ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

# వ్యవసాయ బడ్జెట్ ప్రసంగము

# 2013-14

## కన్నా లక్ష్మి నారాయణ

వ్యవసాయ మరియు వ్యవసాయ టెక్నాలజి మిషన్ మంత్రి

# 2013, మార్చి 18వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలికి 2013-14 సంవత్సరం వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తూ గౌరవనీయులైన వ్యవసాయ శాఖమంత్రి శ్రీ కన్నా లక్ష్మి నారాయణ గారు చేయు ప్రసంగం

## గౌరవనీయ అధ్యక్షా!

వ్యవసాయ రంగానికి సంబంధించి తొలిసారిగా ప్రత్యేక వార్షిక ప్రణాళికను సమర్పించే అవకాశం నాకు కలగటం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

'అదృష్టం' అని ఎందుకంటున్నానంటే 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని మన వేదాలలో చెప్పబడింది. మనం తినే ప్రతి మెతుకు భగవంతుడి సృష్టిలోంచి లభిస్తున్నదే కాబట్టి, దాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేయాలన్న స్ఫూర్తి ఈ వేదోక్తి వెనకాల వుంది.

ప్రతి మనిషీ కష్టపడి కూలి పని చేసుకున్నా, వ్యాపారం చేసినా, ఉద్యోగం చేసినా... ఏం చేసినా అన్నింటి పరమావధి ముందుగా కడుపు నింపుకోవటం. కొన్ని కోట్ల మంది ప్రజల ఆకలి తీర్చే రైతు శ్రేయస్సు గురించి ఆలోచించటానికి, రైతు అభివృద్ధి గురించి పథకాలు రూపొందించడానికి, తద్వారా దేశ అభివృద్ధిలో మనం కీలక భాగస్వాములం కావటానికి రచన చేసేలా నాకు అవకాశం కల్పిస్తున్నది ఈ వ్యవసాయ శాఖ మంత్రి పదవి.

ఈ రోజు నేను సమర్పిస్తున్న వ్యవసాయ ప్రణాళికా బడ్జెట్ నా దృష్టిలో మన రాష్ట్ర చరిత్రలో అత్యంత విశిష్టమైన బడ్జెట్‌లలో ఒకటి. గౌరవ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గారి ఆలోచన మేరకు రైతు యొక్క సమగ్ర అభివృద్ధి కోసం దీన్ని ఉద్దేశించటం జరిగింది. ఏయే విభాగాలలో రైతుకి కొత్తగా ప్రోత్సాహం అందాలో, ఏయే చోట్ల, ఇప్పుడిస్తున్న ప్రోత్సాహకాల్ని పెంచాలో, ఎక్కడెక్కడ ఇతర శాఖలతో సమన్వయాన్ని పటిష్టం చేయాలో, ఏయే పంటల విషయంలో అధిక దిగుబడికి వీలుగా చర్యలు తీసుకోవాలో... ఇలా ఎన్ని రకాలుగా నిర్దిష్టమైన, నిర్దుష్టమైన వ్యూహాన్ని అవలంబించాలో అధికారులతో, రైతు ప్రతినిధులతో, శాస్త్రవేత్తలతో, సంబంధిత అన్ని వర్గాల వారితో క్షుణ్ణంగా చర్చించాక ఈ ప్రణాళికను రూపొందించడం జరిగింది.

ప్రతి సంవత్సరం సమర్పించే బడ్జెట్టే కదా! దీని కోసం ఇంత కసరత్తు చేయాలా? అని ప్రతిపక్షంలో మిత్రులకి అనిపించవచ్చు. అలాంటి వారి కోసం 'కవి కోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రైతునుద్దేశించి ఏమన్నారో వినిపిస్తాను:

**పల్లె యెల్లెయె సర్వ ప్రపంచ సీమ**

**ప్రియ యొకర్తయె రమణీయ విగ్రహంబు**

**బంగారు పంటపొలములే భాగ్యనిధులు**

**అనుదిన పరిశ్రమమే మతమగును నీకు.**

ఇవ్వాళ్టికీ మన రాష్ట్రంలో 60 శాతంపైగా ప్రజలు వ్యవసాయరంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ప్రత్యక్షంగా ఒకకోటి 31 లక్షల రైతుకుటుంబాలు కాడి పట్టుకొని దుక్కిదున్నితేనే మనందరం కడుపునింపుకుంటున్నాం.

మనజాతిపిత మోహనదాస్ కరంచంద్ గాంధీ నుంచి ఇవ్వాళ్టి ప్రధాని మన్మోహన్ సింగ్ వరకూ, మన ఆర్థిక రంగ విశ్లేషకుల ప్రసంగాలు చూస్తే అర్థమవుతుంది. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసే ఏ పాలకుడూ, ఏ ప్రభుత్వమూ నిలబడదు.

"సానో భూమిః వర్థయత్ వర్థమానా" అని యజుర్వేదంలో చెప్పబడింది. అంటే - వ్యవసాయం చేతనే పృధ్వి అన్ని సంపదలను మనకు ప్రసాదిస్తుంది.

ఏ రైతు స్వేదంతో తడిసిన నేలలోంచి మనందరికీ తిండిగింజలు లభిస్తున్నాయో,

ఏ రైతు ఆదివారాలు, సెలవులు, విశ్రాంతి కోరకుండా వర్షాల్లో తడుస్తూ, చలిలో వణుకుతూ కూడా విత్తనం నాటిన దగ్గర్నుంచి పంట కోసి, మార్కెట్‌కి తరలించే దాకా నిరంతరాయంగా పనిచేస్తూవున్నాడో,

ఏ రైతు ఇంట్లో గాదెలు నిండితే దేశమంతా సుభిక్షంగా వుంటుందని మేం నమ్ముతున్నామో,

ఏ రైతు తన నిరంతర కృషితో, సృజనాత్మక శక్తితో, కొత్త వంగడాలని ఆహ్వానిస్తూ, ప్రపంచ విపణిలో పోటీపడేలా అంతర్జాతీయ ప్రమాణాలు గల పంటల దిగుబడిని సాధించగలుగుతున్నాడో,

... అలాంటి ప్రతి రైతు గడపా నిత్యం సుఖశాంతులతో, సిరిసంపదలతో సంతోషం వెల్లి విరిసేలా వుండాలన్న లక్ష్యంతోనే ప్రత్యేక వ్యవసాయ ప్రణాళికకు కిరణ్‌కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం చొరవ తీసుకోవటం జరిగింది.

నిజానికి తొమ్మిదేళ్ళ క్రితమే రాష్ట్ర ప్రభుత్వం రైతుకివ్వాల్సిన ప్రాధాన్యతని గుర్తించింది.

“దేశానికి నిరంతరం వృద్ధి చెందే సంపదని ఇవ్వగలిగేది వ్యవసాయం మాత్రమే” అని శ్రీమతి ఇందిరాగాంధీ చెప్పేవారు. అందుకే రైతు సుఖంగా వుండటానికి ప్రాధాన్యతనివ్వాలి కాని, అతని ఉసురుపోసుకుంటూ ఇతర రంగాల అభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యతనిస్తూ పరుగులు తీయటం పనికిరాదు - అని 2004లో మా ప్రభుత్వం నిర్ద్వంద్వంగా ప్రకటించిన విషయం మీకు గుర్తు చేస్తున్నాను.

“అన్న మిడుట కన్న

అధిక దానంబుల నెన్ని

చేయనేమి యెన్నబోరు

విశ్వదాభిరామ వినురవేమ”

అన్నదానాన్ని మించిన దానంగలదా? అన్నదాతని మించిన దాతగలరా?

మనకి కడుపునింపే రైతు గడపని సుఖసంతోషాలతో నింపటమే అప్పుడైనా ఇప్పుడైనా మా ప్రభుత్వ లక్ష్యం.

ఈ లక్ష్యానికి అనుగుణంగానే గత తొమ్మిదేళ్ళలో అనేక చర్యలు తీసుకున్నాం.

2004-05లో రూ. 1300 కోట్ల మేరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల బిల్లుల బకాయిల్ని రద్దు చేశామన్నా, పావలావడ్డీకి పంటరుణాలిచ్చే పథకం ప్రవేశపెట్టినా, చిన్న సన్నకారు రైతులకి రూ. 3 లక్షల దాకా పంట రుణాల మీద స్టాంపు డ్యూటీ మినహాయించామన్నా, చిన్న రైతులందరికీ ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నా... వీటన్నింటి వెనకాల స్ఫూర్తి ఒక్కటే - రైతుని నిలబెట్టాలి. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దాదాపు 63 లక్షల మంది రైతులకి రూ.11,354 కోట్ల మేరకు రుణభారం నుంచి విముక్తి కలిగించాం. ఆ పరిధిలోకి రాని దాదాపు 32 లక్షల మందిరైతులకి ఒక్కొక్కరికి రూ. 5000 వంతున రూ. 1633 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించాం.

ఆర్థిక సహాయాన్ని అందించడమేకాక, మన రైతుకి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పంట దిగుబడులు సాధించేలా శిక్షణనివ్వాలి. వ్యవసాయ విస్తరణ జరగాలి. అధిక ఉత్పత్తి వంగడాలను ప్రవేశపెట్టాలి... ఇలాంటి కార్యక్రమాలకి అవకాశమిచ్చే ‘ఆహారభద్రతా మిషన్’ని మనం హైదరాబాద్‌లో 2007లో ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ గారి చొరవతో రూపొందించుకొన్నాం.

ఈ మిషన్ లక్ష్యసాధన కోసం - అంతర్జాతీయ విపణిలో పోటీ పడగలిగే పంటలకోసం రూ. 100 కోట్లతో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సమాయత్త పరుస్తున్నాం.

రైతులకి శిక్షణనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'రాష్ట్రీయ కృషి వికాస యోజన' కార్యక్రమం అమలు చేశాం.

రైతు చైతన్యయాత్రల ద్వారా వ్యవసాయంలో కొత్త విధానాలను ఆహ్వానించేలా రైతుని ఉత్తేజపరచటం ప్రారంభించాం.

రైతులు పండించే నాణ్యమైన పంటలకి అంతర్జాతీయ మార్కెటింగ్ అవకాశాలు కల్పించేలా వ్యవసాయ కమీషనర్ కార్యాలయంలో 'ప్రపంచ వాణిజ్య సంస్థ విభాగం' కూడా ఏర్పాటు చేశాం.

ఇదే సమయంలో ప్రధానమంత్రి ప్యాకేజి క్రింద నీటి పారుదల, వ్యవసాయం, పండ్ల తోటలు, పశు సంవర్థన, చేపల పెంపకం వంటి రంగాల అభివృద్ధి కోసం రూ. 9650 కోట్లు వెచ్చించాం. ఇందులో రూ. 1962 కోట్ల మేరకు వివిధ రుణాల మీద వడ్డీ భారాన్ని రద్దు చేయడం జరిగింది.

ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయే రైతుల కోసం - గ్రామం ఒక యూనిట్‌గా పంటలబీమా పథకాన్ని మార్పుచేశాం.

రైతుని సాంకేతికంగా శక్తి వంతుణ్ణి చేయటం కోసం కూడా అనేక చర్యలు తీసుకొన్నాం. ఏడు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేశాం... పశుసంవర్ధక రంగం కోసం, పండ్లతోటల అభివృద్ధి కోసం రెండు వేర్వేరు విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేశాం.. విత్తన గ్రామాల అభివృద్ధి కార్యక్రమం చేపట్టాం. ప్రతి జిల్లాలో విత్తన, భూసార, ఎరువుల పరీక్షా కేంద్రాల ఏర్పాటుకి చొరవ తీసుకొన్నాం. ఇలాంటి అనేక చర్యలు మనరైతుల్లో కొత్త విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి.

పత్తి పండించే రైతులకోసం ప్రభుత్వం న్యాయపోరాటం చేసి 'బిటి' పత్తి విత్తనాల ధరను 40 శాతానికి తగ్గించిన విషయం కూడా మీకు గుర్తు చేస్తున్నాను.

ధరలు పెరుగుతున్నప్పుడు, జనాభా పెరుగుతూ మన అవసరాలు పెరుగుతున్నప్పుడు సాధించాల్సిన లక్ష్యాలు కూడా పెరుగుతుంటాయి, లేదా మారుతుంటాయి.

గతంలో రైతుల గురించి ఆలోచించి చాలా చేశాం అనుకున్నాం. కాని కౌలు రైతుల విషయంలో ముందుకు పోలేకపోయాం.

కిరణ్‌కుమార్‌రెడ్డి గారి సారధ్యంలో 2011 డిసెంబర్‌లో మా ప్రభుత్వం తీసుకువచ్చిన 'సాగురైతుల రక్షణ హస్తం' ఈ దిశగా ఒక విప్లవాత్మకమైన చర్య. భూముల సొంతదారులకు లభించే పరపతి సదుపాయం కౌలు రైతుల క్కూడా కల్పించే లక్ష్యంతో ఈ చట్టాన్ని రూపొందించుకున్నాం. దీన్ని విజయవంతం చేసే దిశగా అనేక చర్యలు చేపడుతున్నాం.

గత రెండేళ్ళలో ఈ ప్రభుత్వం తీసుకొన్న మరికొన్ని అసాధారణమైన చర్యల్లో - వడ్డీలేని పంటరుణాలు అతి ముఖ్యమైంది. లక్షరూపాయలలోపు వ్యవసాయ రుణాలకు వడ్డీలేదు. లక్ష దాటితే రూ. 3 లక్షల వరకు పావలా వడ్డీ మాత్రమే వుంటుంది. లక్షలాది రైతులు ఈ పథకం వల్ల ప్రయోజనం పొందారని చెప్పటం నాకు ఆనందం కలిగిస్తోంది.

ప్రకృతి వైపరీత్యాలకు గురయ్యే రైతులకిచ్చే రాయితీల్ని అన్ని పంటల మీద 67 శాతం పెంచాం. వరికైతే ఈ ఇన్‌పుట్ సబ్సిడీని హెక్టారుకి రూ. 6000 నుంచి రూ.10,000కి పెంచాం. మీరు గమనించి వుంటారు. 52 లక్షల మంది బాధిత రైతులకిచ్చే ఇన్‌పుట్‌రాయితీ మొత్తం రూ. 1816 కోట్లను మా సుపరిపాలనా విధానాలకు లోబడి ఆయా రైతుల ఖాతాలకే నేరుగా జమచేస్తున్నాం.

అధ్యక్షా, దేశంలోనే ఇది మొదటి సారి. ఈ విధానం వల్ల  రాయితీ మొత్తంకోసం అన్నదాత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితిని శాశ్వతంగా తొలగించామని చెప్పటం నాకు ఆనందంగా వుంది.

నాణ్యమైన విత్తనాలే రైతులకి అందేలా 'విత్తన బిల్లు'ని ఇప్పుడు ప్రవేశపెడుతున్న విషయం కూడా మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

ఉపాధి హామీ పథకం వల్ల కూలీల కొరత ఏర్పడుతోందన్న సమస్యకు పరిష్కారంగా పెద్దయెత్తున్న వ్యవసాయ యాంత్రీకరణను ఇప్పుడు చేపట్టాం. రాబోయే మూడేళ్ళలో రూ. 2500 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

ఎంత శ్రమపడినా, ఎంత నాణ్యమైన విత్తనాలతో ఎంతో మంచి పంట పండించినా, ఆ పంటకి గిట్టుబాటు ధర రాకపోతే రైతు గుండెల్లో ఎంతటి నైరాశ్యం పేరుకుంటుందో ఒక రైతుగా నాకు అనుభవమే.

ఇందిరాగాంధీ మాటల్లో చెప్పాలంటే - "మన ప్రభుత్వ ప్రధాన ఆవశ్యకత వ్యవసాయం. 75 శాతం ప్రజలు పల్లెలోనే జీవిస్తున్నారు. వ్యవసాయమే వారి జీవనాధారం. అందుకే వారు పల్లెల్ని వదిలిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరి మీదా వుంది".

## అధ్యక్షా!

కృషీవలుడికి తన పంటకి గిట్టుబాటు ధర అంతిమలక్ష్యం అవుతోంది. 2004-05లో వరి కనీస మద్దతు ధర క్వింటాల్‌కి రూ. 550గా వుంటే, 2012-13 నాటికి దాన్ని మన్మోహన్ సింగ్ గారి ప్రభుత్వం రూ. 1250కి పెంచింది. అన్ని ఇతర పంటల విషయంలోనూ ఈ పెరుగుదల వచ్చింది.

మరో అడుగు ముందుకి వేసి, ఒక రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేసి మార్కెట్‌లో వచ్చే ఆటుపోట్ల నుంచి వ్యవసాయ దిగుబడులకు రక్షణ కల్పించే దిశగా కిరణ్‌కుమార్‌రెడ్డి గారి ప్రభుత్వం కృషి చేస్తోంది.

వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం. కాని, అనేక సందర్భాలలో కొన్ని అనుబంధరంగాలతో కలిపి వ్యూహరచన చేసి, పనిచేయాల్సిన చోట అవసరమైన సమన్వయాన్ని సాధించటానికి మన బడ్జెట్ రచన సానుకూలంగా లేదు.

ఉదాహరణకి ఒక రైతు తన పొలంలో కొంత వరి తదితర ధాన్యాలు పండిస్తాడు. కొంత భాగంలో నిమ్మతోట వెయ్యాలనుకుంటాడు. ఒకటి వ్యవసాయ శాఖ కిందకి వస్తుంది. మరొకటి ఉద్యానవనశాఖ క్రిందకి వస్తుంది. లేదా పొలంలో కొంత భాగం చేపల పెంపకం చేపట్టాలనుకుంటాడు. ఇది మత్స్యశాఖ క్రిందకి వస్తుంది. ఇలా ఎన్నో....! అందుకే ఆయాశాఖల మధ్య సమన్వయం కావాలి.

## వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

గతంలో వ్యవసాయం, ఉద్యానవనాలు, పశుసంవర్ధన, తదితర శాఖలన్నీ మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో భాగంగా వుండటం వల్ల 'వ్యవసాయ - అనుబంధ రంగాల' సమగ్ర సమీకృత అభివృద్ధికి వుండాల్సినంత అవకాశం వుండేది కాదు. నిజానికి వ్యవసాయం అనేది రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన రంగం. అందుకే ప్రభుత్వ సిబ్బంది కీలకపాత్ర వహిస్తారు.

వ్యవసాయ ఉత్పత్తి అనేది చాలా వరకూ సాగు చేసే విస్తీర్ణంపై ఆధారపడి వుంటుంది. 1970-71 నుంచి మనం సేకరిస్తూ వున్న గణాంకాల ప్రకారం - 1995-96 నాటికి సగటున ఒక్కొక్క రైతుకి గల కమతం 1.36 హెక్టార్లు. 2000-01 నాటికి అది 1.25 హెక్టార్లు. 2005-06 నాటికి అది ఇంకా చిక్కిపోయి 1.20 హెక్టార్లకి చేరుకుంది. తాజా గణాంకాల ప్రకారం అది 1.08 హెక్టార్లుగా వుంది. నానాటికీ కమతాలు చిన్నవై పోతుండటం వల్ల, అలాంటి చిన్న కమతాలను ఒక్కటిగా చేర్చి, నూతన సేద్యపు విధానాలను గానీ, లాభదాయకమైన మార్కెటింగ్ విధానాలను గానీ అమలు చేయటం దుస్సాధ్యవుతోంది. ముఖ్యంగా వర్షాధార భూములలో సేద్యం విషయంలో ఇది మరింత జటిలంగా తయారైంది.

ఈ నేపథ్యంలోనే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ గురించిన ఆలోచన ఉత్పన్నమైంది.

రైతు అభివృద్ధి అనేది అనేక ఇతర శాఖలతో సమన్వయంతో జరగాల్సిన పరిణామం. కాని, వ్యవసాయం తరచూ అనేక రకాల ఆటు పోట్లకు గురవుతోంది.

.... ఇలాంటి స్థితిలో రాష్ట్ర ప్రగతి పథంలో మనం పెట్టుకున్న లక్ష్యాలను సాధించాలంటే వ్యవసాయం, సంబంధిత ఇతర రంగాల మధ్య పరస్పర అవగాహనతో కలిసి పనిచేసే సమీకృత వ్యూహం కావాలి. ఇది ప్రణాళిక రచన స్థాయిలో, ప్రణాళికను అమలు చేసే దశలో, పర్యవేక్షణ - విశ్లేషణ దశల్లో కూడా ప్రభావం చూపేదిగా వుండాలి.

అన్నదాత నమ్ముకున్న వ్యవసాయ రంగానికి, సంబంధిత ఇతర రంగాలకి మధ్య సమన్వయంతో కూడిన సమీకృత ప్రణాళికని రూపొందిస్తేనే, అన్నదాతకి అవసరమయిన శ్రద్ధాసక్తులతో, నిర్దిష్ట దిశగా ప్రణాళికను అమలు చేస్తూ వ్యవసాయ రంగంలోనూ, అనుబంధ రంగాల్లోనూ ఆశించిన లక్ష్యాలను వేగంగా సాధించగలమని మేం నమ్ముతున్నాం. అందుకే ఇలా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ రూపకల్పనకి శ్రీకారం చుట్టాం.

ఇది విజయవంతంగా అమలు జరిగేలా చేయటం కోసం విశేషమైన కసరత్తుచేశాం. సంబంధిత అన్ని వర్గాలతోనూ సుదీర్ఘంగా చర్చలు జరిపాం. ఆర్థిక శాఖా మంత్రి, వారి అధికారులు, ప్రణాళికా శాఖ అధికారులు - నిపుణులు, వ్యవసాయ నిపుణులు, రైతు ప్రతినిధులు... ఇలా అనేకమంది ఈ ప్రక్రియలో భాగస్వాములైనారు.

"అందరూ కలిసి పనిచేయటం వల్ల మెరుగైన ఫలితాలను సాధించగలం" అని నమ్మే కిరణ్‌కుమార్ రెడ్డి గారి సూచనలు కూడా పరిగణనలోకి తీసుకుని ఈ బృహత్ ప్రయత్నం చేశాం.

✷ సమీకృత విధానంలో రూపకల్పన జరగటం వల్ల సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయంలో నాణ్యత పెరుగుతుంది.

✷ వ్యవసాయ రంగానికి చెందిన వివిధ సంస్థల ప్రోత్సాహం సంబంధిత అన్ని రంగాలకూ అవసరమైన స్థాయిలో అందుతుంది.

✷ అనుబంధ రంగాలు, వాటి ఉపరంగాలలో ఉత్పత్తి అంశాలను, ఉత్పత్తుల రవాణా, మార్కెటింగ్ వంటి అంశాలను పరిష్కరించేందుకు తగిన కార్యక్రమాలను జాప్యం లేకుండా చేపట్టడం సాధ్యపడుతుంది.

✷ ఆయా అనుబంధ రంగాలలో, సంబంధిత ఇతర శాఖలలో ఉత్పన్నమవుతున్న అవాంఛనీయ పరిస్థితులను ఏకోన్ముఖంగా పరిష్కరించడం సాధ్యపడుతుంది.

✷ ఇక్రిశాట్ వంటి పరిశోధన సంస్థలు అందించే శాస్త్రీయ పరిశోధనా ఫలితాలు ఆధారంగా సేద్యాన్ని లాభసాటి వృత్తిగా చేయగల నూతన సాంకేతిక ప్రక్రియలను చేపట్టే అవకాశం కలుగుతుంది.

✷ సమీకృత ప్రక్రియ వల్ల ఆయా రంగాలలోని వివిధ ఉత్పత్తులకు - వాటికి గిరాకీ పెరిగేలా మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుంది.

✷ వ్యవసాయ రంగంలో వస్తున్న రూపాంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోవటం, వర్షాధారిత

భూములకు సంబంధించిన అంశాలను పరిష్కరించి, వ్యవసాయం లాభసాటిగా చేయడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

## ఈ ప్రత్యేక బడ్జెట్‌లో భాగస్వాములు :

సాగునీరుకి, భూమికి సంబంధించి ఏయే శాఖల మధ్య సమన్వయంతో కూడిన కార్యాచరణ అవసరమో ఆయా శాఖలన్నీ ఈ ప్రత్యేక బడ్జెట్‌లో భాగస్వాములే. అంటే - వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమ శాఖ, అటవీశాఖ, సహకార శాఖ, ఆయకట్టు అభివృద్ధికి సంబంధించిన భారీ - మధ్య తరహా చిన్న తరహా - నీటి పారుదల శాఖలు, భూగర్భ జలశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ గిడ్డంగుల శాఖ, చక్కెర శాఖ వగైరాలు ఈ ప్రత్యేక బడ్జెట్‌లో భాగస్వాములు.

## అధ్యక్షా!

నేను ఇన్ని శాఖల మధ్య సమన్వయంతో, ఒక సమీకృత కార్యాచరణ ప్రణాళికతో పనిచేయటానికి ఒక ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ని రూపొందించామని చెప్పినప్పుడు, "దీని ఆధారంగా ఎలాంటి వ్యూహాల్ని రైతుల మెరుగైన భవిష్యత్ కోసం రూపొందిస్తున్నారు?" అన్న ప్రశ్న ఇక్కడ మిత్రులు లేవదీయవచ్చు.

ఇదొక కొత్త ప్రయత్నం. బృహత్ ప్రయత్నం. కోట్లాది ప్రజల కడుపునింపే తిండిగింజల్ని పండించటం కోసం కష్టాల్ని, కన్నీళ్ళని దిగమింగుకుంటూ, అహొరాత్రులూ శ్రమిస్తున్న రైతు కుటుంబాన్ని నిలబెట్టడం ద్వారా, అతన్ని మన సమాజంలో ఒక గర్వకారణమైన వృత్తిదారుగా నిలబెట్టడం ద్వారా ఈ రాష్ట్ర ఆర్థిక పురోగతి వేగాన్ని క్రమబద్ధంగా పెంచే ప్రయత్నం ఇది.

అందుకే ఈ బడ్జెట్ రూపకల్పనని ఆధారం చేసుకుని 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని నిర్ణయించుకున్నాం.

ఇందులో...

- సేద్య విధానాల రూపు రేఖలలో మార్పులు తీసుకువచ్చి, అవకాశమున్న చిట్ట చివరి పెరుగుదల స్థాయి వరకూ రైతు ఎదిగేలా చేయటం

- వ్యవసాయ యాంత్రీకరణను వేగంగా, విస్తృతంగా సాగించటం

- రైతులకి వ్యవస్థాగత పరపతి సదుపాయం, బీమా సదుపాయం విస్తృతంగా లభించేలా చేయటం

- రైతుల అభివృద్ధిని, మార్కెట్ వ్యవస్థను అనుసంధానం చేయటం

- ఆహారోత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమపై ప్రత్యేక శ్రద్ధపెట్టడం

- పరిశోధనలు - అభివృద్ధి మీద అత్యధికంగా దృష్టిని సారించటం

ఈ వ్యూహాలకు లోబడి 12వ ప్రణాళికా కాలంలో ఎంచుకున్న ప్రాధాన్యతా అంశాలు:

1. 'శ్రీ' వరిసాగు క్రింద ఆయకట్టుని ఇప్పుడున్న 2.80 లక్షల హెక్టార్ల నుంచి 10 లక్షల హెక్టార్లకు పెంచటం

2. ఆయిల్‌పామ్‌కి సానుకూలంగా వున్న మొత్తం 4.2 లక్షల హెక్టార్లకు ఆయిల్‌పామ్ సాగుని విస్తరింపజేయటం

3. సూక్ష్మ సేద్యం క్రింద విస్తీర్ణాన్ని ఇప్పుడున్న 8 లక్షల హెక్టార్ల నుంచి 20 లక్షల హెక్టార్లకు పెంచటం

4. సేద్యంలో యంత్రపరికరాల వినియోగాన్ని, సునిశితమైన సేద్యపు మెలకువలను ప్రోత్సహించటం

5. రైతు ప్రయోజనాల గురించి ఆలోచించేలా 'రైతు బృందాల'ను, వ్యవసాయోత్పత్తుల ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పరచి, విస్తరింపజేయడం

6. వ్యవసాయంలో అవసరమైన యంత్రసామగ్రిని అద్దెకిచ్చే, సర్వీసింగ్ చేసే కేంద్రాలను ఒక వెయ్యి దాకా ఏర్పాటు చేయటం

7. జీవ ఇంధన వృక్షాల తోటల పెంపకాన్ని లక్ష ఎకరాలకు విస్తరింపజేయటం

8. పాడి పశువులు, గొర్రెలు, మేకలు వంటి పశుసంపదకి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం

9. బొవైన్ బ్రీడింగ్ కార్యక్రమాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టడం

10. వ్యవస్థీకృత పాల మార్కెటింగ్ ప్రాసెసింగ్‌ని విస్తృత పరచటం

11. అవసరాల మేరకు పశువుల మేత, దాణా ఉత్పత్తిని పెంచటం

12.స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించి, మేకలు, గొర్రెల పెంపకం అభివృద్ధి చెందేలా చేయటం

13. చేపల విత్తనాలను వివిధ రిజర్వాయర్లలో, చెరువులతో నిలవచేసే విధానాలు చేపట్టడం

14. ప్రభుత్వ చేప విత్తన ఉత్పత్తి కేంద్రాలను పటిష్టం చేయడం

15. సంప్రదాయక వృత్తులలో యాంత్రిక విధానాలను ప్రవేశ పెట్టడం

16. పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం మల్బరీ సాగుని విస్తరింపజేయటం

17. పట్టు పెంపకం కేంద్రాల నిర్మాణం ప్రోత్సహించడం

## అధ్యక్షా!

రైతులు ఎలాంటి పంటని సాగుచేసినా అతనికి అవసరమైన సాగునీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత నీటిపారుదల శాఖదే. అయితే ఏ ప్రాంతంలో ఎలాంటి సేద్యపు నీటి వనరుల కల్పనకి, లేదా విస్తరణకి ప్రాధాన్యత నివ్వాలో నిర్ణయించే విచక్షణ వ్యవసాయ శాఖకి వుండాలా? నీటిపారుదల శాఖకు వుండాలా?... ఇలాంటి సందేహాలు అనేకం.ఈ సందేహాల పరిష్కారంలోనే పుణ్యకాలం గడిచి పోయే పరిస్థితి ఏర్పడకుండా వుండాలంటే - వ్యవసాయం, దాని అనుబంధ రంగాలన్నింటి మధ్య సమన్వయం ఉండాలి. ఇన్ని శాఖల మధ్య సమన్వయం వుండాలంటే ఈ శాఖలన్నింటినీ కలిపి సమీకృతం చేస్తూ, పూర్తి శ్రద్ధ, ప్రాధాన్యతలతో ఒక సమీకృత బడ్జెట్ రూపొందాలి.

ఈ బడ్జెట్ రూపకల్పన లక్ష్యం వ్యవసాయశాఖ, దాని అనుబంధ రంగాల్లో అభివృద్ధి ఎలాంటి ఆటంకాలూ, సందేహాలూ లేకుండా స్పష్టమైన, స్థిరమైన దీర్ఘకాలిక ఫలితాలనిచ్చేలా వుండాలి.

ఈ బడ్జెట్ 'నా శ్రేయస్సు కోసం, అభివృద్ధికోసం రూపొందింది' అన్న విశ్వాసం రైతుకి కల్పించేలా వుండాలి.

ఈ బడ్జెట్ ఈ ప్రభుత్వ విధానానికి అద్దంపట్టేలా వుండాలి.

ఈ బడ్జెట్ యొక్క అంతిమ ప్రయోజనం - రైతు గౌరవాన్ని, ఆర్థిక-సామాజిక హోదాని పెంచేలా వుండాలి.

ఒక్కసారి బడ్జెట్ రూపొందించాక, ఈ బడ్జెట్ నిధులన్నీ నూటికి నూరు శాతం ఆయా పథకాలకు, కార్యక్రమాలకు వినియోగించబడే లక్షణాన్ని ప్రతిబింబించాలి.

12వ పంచవర్ష ప్రణాళికలో 2016-17 నాటికల్లా మన ఆహారధాన్యాల ఉత్పత్తిని ఇప్పటి 184 లక్షల టన్నుల నుంచి 300 లక్షల టన్నులకు పెంచాలి.

మన రాష్ట్రంలో ఒక కోటి 31 లక్షల రైతు కుటుంబాలు - సుమారు 143 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి - 75 లక్షల హెక్టార్లకు నీటి వసతి - 234 లక్షల పశుసంపద - ఇంకా గొర్రెలు, మేకలు, కోళ్ళ పెంపకం (కోళ్ళ పెంపకంలో దేశంలో కెల్లా అగ్రస్థానంలో వున్నాం..) ...ఇంత విస్తృతమైన వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో ఉధృతమైన ప్రగతిని సాధించాలంటే, వ్యవసాయ రంగానికి ఒక ప్రత్యేక బడ్జెట్ వుండి తీరాలి అని

కిరణ్‌కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం భావిస్తోంది.

అందుకే మొదటిసారిగా ప్రత్యేక బడ్జెట్‌ని ప్రవేశపెడుతున్నాను.

## అధ్యక్షా!

ఇక్కడ సమావేశమైన మనలో అధిక శాతం గ్రామాల నుంచి వచ్చిన వాళ్ళమే. స్వచ్ఛమైన గాలి, వెలుతురు, పచ్చటి పైర్లు, కాలుష్య రహిత వాతావరణంలో పుట్టి పెరిగిన వాళ్ళమే. అందుకే మనం ఆ పల్లెసీమల్ని ప్రేమిస్తాం.

గ్రామ ఆర్థిక వ్యవస్థ అంతా రైతు సంక్షేమం చుట్టూ అల్లుకొని వుంటుంది. పంటలు బాగా పండి, రైతు పచ్చగా వున్నాడంటే, పల్లెల్లో కమ్మరి, కుమ్మరి, కంసాలి, వడ్రంగి వగైరా అన్ని వృత్తుల వారి కుటుంబాలూ పచ్చగా వుంటాయి. అన్ని గ్రామాలూ అలా పచ్చగా వున్నాయంటే మన రాష్ట్రం సుభిక్షంగా వున్నట్లే.

ఈ మౌలిక సూత్రాన్నే కిరణ్‌కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం విశ్వసిస్తోంది. అందుకే రైతు పచ్చగా వుండటానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఒక కోటీ 31 లక్షలకు పైగా రైతు కుటుంబాల జీవన భద్రతకీ, 60 శాతం పైగా రాష్ట్ర జనాభాకి ఉపాధి కల్పనకి వ్యవసాయమే కీలకమైనదన్న వాస్తవాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగానే పథకాలను కూడా రచిస్తోంది.

సహజ వనరులు మనకి సమృద్ధిగా వున్నప్పటికీ, సుమారు 143 లక్షల హెక్టార్లకు పైగా భూమి సాగులో వున్నప్పటికీ, కృష్ణా గోదావరి తదితర నదీ జలాలతో, పొడవాటి తీర ప్రాంతంతో, 23 శాతం విస్తీర్ణంలో అటవీ భూమితో అత్యంత సంపన్నవంతమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ పిలవబడుతున్నప్పటికీ, దురదృష్టమేమిటంటే మన - సేద్యం తరచూ ఆటుపోట్లకు గురవుతూనే వుంది. ఇలాంటి పరిస్థితుల్లో మన వ్యవసాయ విధానాలను పునస్సమీక్షించుకోక తప్పని పరిస్థితి మన ముందుంది.

## అధ్యక్షా!

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం అవతరించిన నాటి నుంచి ఇప్పటి వరకూ మనం వ్యవసాయికంగా ఎంతో పురోగమించామన్నది నిజం. 1956లో మన ఆహారధాన్యాల ఉత్పత్తి 56 లక్షల టన్నులుగా వుంటే, ఇప్పుడు - అంటే, ఈ ఆరుదశాబ్దాల కాలంలో - అది 200 లక్షల టన్నులకి చేరుకుంది. ఫలితంగా దేశంలో కెల్లా అత్యధిక పరిమాణంలో వరిని పండించే రాష్ట్రంగా మనం గుర్తింపు పొందాం. అంతేకాదు, పుగాకు, వేరుశనగ, మిర్చి, పసుపు, నూనె గింజలు, ప్రత్తి, చెరకు, గోగునారల ఉత్పత్తిలో కూడా మనమే అగ్రస్థానంలో వున్నాం.

ఇటీవలి కాలంలో ఇంకో అడుగు ముందుకు వెళ్ళాం. మామిడి, ద్రాక్ష, జామ, సపోటా, బొప్పాయి, అరటిపండుల విషయంలో అత్యంత నాణ్యమైన దిగుబడిని సాధిస్తున్నాం.

నేను సభ్యులకు ఒక్కసారి గుర్తుచేస్తున్నాను. గడిచిన 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో మన రాష్ట్రం సగటున 5.93 శాతం వృద్ధి రేటుని సాధించింది. దక్షిణాది రాష్ట్రాలన్నింటిలోకి అధికంగా వరి, పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచినందుకు గాను 'జాతీయ ఆహార భద్రతా మిషన్' క్రింద అవార్డుని కూడా సాధించాం.

ఇదే ప్రణాళికా కాలంలో సాధించిన మరికొన్ని విజయాలు ఎలా వున్నాయంటే -

✷ వరి సాధారణ ఉత్పత్తి 5.85 శాతం పెరిగింది.

✷ శనగల ఉత్పత్తి 9.38 శాతం పెరిగింది.

✷ మొత్తం పప్పుధాన్యాల సాధారణ ఉత్పత్తి 3.75 శాతం పెరిగింది.

✷ మొక్కజొన్న సాధారణ ఉత్పత్తి 10.15 శాతం పెరిగింది.

✷ ప్రత్తి సాధారణ ఉత్పత్తి 12.97 శాతం పెరిగింది.

✷ సోయా చిక్కుడు సాధారణ ఉత్పత్తి 2.42 శాతం పెరిగింది.

ఈ వృద్ధి రేటుని ఇంకా పెంచుకోవటం ద్వారా మన ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేయాలన్నా, నేను ముందుగానే చెప్పినట్లు రైతు గౌరవం, హెూదా, ఆత్మ విశ్వాసం పెరగాలన్నా ప్రత్యేక 'వ్యవసాయ రంగ బడ్జెట్' అవసరమని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాం, ఆ నమ్మకంతోనే ఈ చారిత్రాత్మక పరిణామానికి 2013-14 బడ్జెట్‌తో శ్రీకారం చుడుతున్నాం.

"వేగవంతమైన, అధిక జనాభా భాగస్వామ్యంతో, సుస్థిరమైన అభివృద్ధిని సాధించాలి" అన్న 12వ పంచవర్ష ప్రణాళికా స్ఫూర్తికి అనుగుణంగానూ, మన ఆర్థిక వ్యవస్థ 10 శాతం వృద్ధిరేటుని సాధించే లక్ష్యంలో భాగంగా వ్యవసాయ రంగంలో 6 శాతం వృద్ధిరేటుని సాధించాలన్న దృఢ సంకల్పంతోనూ - 2016-17 నాటికి 300 లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి సాధనే ప్రధాన లక్ష్యంగా మేం పెట్టుకోవటం జరిగింది.

వ్యవసాయ రంగం వేగంగా అభివృద్ధి చెందటానికి కొన్ని కీలక ప్రక్రియలను మేం గుర్తించటం జరిగింది.

✷ ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ స్ఫూర్తికి అనుగుణంగా ఆయా శాఖలన్నింటినీ సమన్వయ పరుస్తూ 'అగ్రికల్చరల్ టెక్నాలజీ మిషన్'ను ఏర్పాటు చేయటం

✷ వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేషంగా తోడ్పడే ఉద్యానవన రంగం, పశుసంవర్ధక రంగం, మత్స్య

రంగాలలో ఉత్పత్తి, ఉత్పాదకతలను సాధ్యమైనంత ఎక్కువగా పెంచే వ్యూహరచన చేయటం

✷ సాగు పద్ధతులలో మేలైన సంప్రదాయేతర రీతులను ప్రవేశపెట్టడం

✷ సూక్ష్మ పోషకాల సమతుల్యాన్ని పాటిస్తూ, మేలైన భూసార నిర్వహణను అన్ని కోణాల్లోంచి సమీకృతం చేయటం

✷ రైతులకి వ్యవస్థీకృత పరపతి సదుపాయాన్ని, బీమా ఊతాన్ని ఇనుమడింపజేయటం

✷ మేలిరకం ఇన్‌పుట్‌ల పంపిణీ, క్షేత్రంలో యాంత్రీకరణ, సాగులో ఆటోమేషన్‌లను ప్రోత్సహించటం

✷ సమర్థమైన సాగునీటి నిర్వహణ ద్వారా ఇరిగేషన్ సేవలను మెరుగు పర్చటం

✷ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్‌లో రైతుకి తగిన మద్దతునివ్వటం

✷ ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించటం ద్వారా వ్యవసాయోత్పత్తులకు విలువ పెంచడం

✷ వ్యవసాయంలో పరిశోధన, అభివృద్ధి, విస్తరణ, కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వటం

ఇవన్నీ ఒక్కరోజులో జరిగేవి కావు. కాని వ్యవసాయానికి ప్రత్యేక ప్రణాళిక వుంటే ఇవన్నీ సాధ్యపడుతాయి. మా ఈ అసాధారణ ప్రయత్నం మన వ్యవసాయ రంగాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళి తీరుతుంది.

## అధ్యక్షా!

వ్యవసాయం, సంబంధిత రంగాలకు ఈ ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ క్రింద చేసిన కేటాయింపులు, అందుకు దారితీసిన పరిస్థితులు వివరిస్తాను.

## వ్యవసాయం :

వివిధ పంటల ఉత్పత్తి, ఉత్పాదకతల విషయంలో ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగిన మన రాష్ట్రం గడచిన నవంబరు, డిసెంబర్ మాసాల్లో సంభవించిన 'నీలం' తుఫాను తాకిడికి భారీగా దెబ్బతిన్నది. కోతలకి సిద్ధమవుతున్న అనేక పంటలు నీట మునిగాయి.

ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ విధానాల ద్వారా మనషుల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా మా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోగలిగినప్పటికీ, భారీ నష్టం వాటిల్లింది. ఇందువల్ల 2012-13 వ్యవసాయ సంవత్సరంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 178.27 లక్షల టన్నులకే పరిమితమవుతోంది. వరి సాగు విస్తీర్ణం, దిగుబడి తగ్గటమే ఇందుకు ప్రధాన కారణం. మీకు తెలుసు. మన ఆహారధాన్యాల సాధారణ ఉత్పత్తి 189.08 లక్షల టన్నులు.

అనేక రైతు సంక్షేమ చర్యలను ఇటీవలి కాలంలో ప్రభుత్వం అమలు చేసిన విషయం మీకు గుర్తు చేస్తున్నాను.

శాస్త్రీయమైన సేద్యాన్ని ప్రోత్సహించటం కోసం రైతు చైతన్య యాత్రలను ప్రవేశపెట్టాం... వ్యవసాయ విస్తరణను ప్రోత్సహించటం కోసం 'రైతుబాట' కార్యక్రమం ప్రవేశపెట్టాం... 'పొలం బడి' కార్యక్రమం ద్వారా లక్షమంది దాకా రైతుల్ని వ్యవసాయ విజ్ఞాన వంతుల్ని చేశాం... 'ఆదర్శరైతు' కార్యక్రమం ద్వారా వ్యవసాయ విస్తరణ మారుమూల గ్రామాలకు కూడా వేగంగా చేరేలా చేశాం... ఇలాంటి చర్యల వల్ల వ్యవసాయ పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలకి, రైతుకీ మధ్య దూరం తగ్గింది. అంటే పరిశోధనల ఫలితాలు క్షేత్రస్థాయిలో అమల్లోకి వస్తున్నాయి.

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన "వ్యవసాయ విస్తరణ సంస్కరణల దిశగా ప్రభుత్వ విస్తరణ కార్యక్రమాలకు చేయూత" వగైరా వివిధ విజ్ఞాన ప్రసరణ కార్యక్రమాలు మన రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అమలు జరుగుతున్నాయి. వీటివల్ల ఆయా జిల్లాల అవసరాలకు తగినట్లుగా రైతు శిక్షణా శిబిరాల నిర్వహణ, ప్రదర్శనలు, అవగాహనా పర్యటనలు, కిసాన్ మేళాలు, క్షేత్ర సందర్శన దినాలు, వ్యవసాయ శాస్త్రజ్ఞులతో రైతుల ముఖాముఖి అవగాహనా సదస్సులు అమలు చేయడం జరుగుతోంది. ఓ ప్రక్క ఈ కార్యక్రమాలు జరుగుతూండగానే మరో ప్రక్క రైతులకి 50 శాతం సబ్సిడీ మీద రూ. 261.40 కోట్ల వ్యయంతో 15.28 లక్షల క్వింటాళ్ళ మేలిరకం విత్తనాన్ని పంపిణీ చేయడం జరిగింది.

గడచిన ఖరీఫ్ - 2012లో 30.04 లక్షల టన్నుల మేరకు, ప్రస్తుత రబీలో 21.49 లక్షల టన్నుల మేరకు వివిధ శ్రేణుల ఎరువుల్ని సరఫరా చేశాం. నిజానికి 2012-13లో మన లక్ష్యం 38.50 లక్షల టన్నుల ఎరువుల పంపిణీ. అంటే, లక్ష్యాన్ని అధిగమించి పంపిణీ చేశాం.

2012-13లోనే 'శ్రీ' (System of Rice Intensification) వరి సాగుని పెద్ద యెత్తున 2.80 లక్షల హెక్టార్లలో ప్రోత్సహించే కార్యక్రమం చేపట్టాం. 2013-14లో మరో అయిదు లక్షల హెక్టార్లలో కూడా 'శ్రీ' విధానంలో వరి సేద్యాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించాం.

'పప్పుధాన్యాల ఉత్పత్తి ఉధృతం' (A3P) చేసే కార్యక్రమం కూడా మన రాష్ట్రంలో అమల్లో వుంది. దీని క్రింద 'సమీకృత పోషక పదార్థాల నిర్వహణ', 'సమీకృత తెగుళ్ళ నియంత్రణ' కిట్‌లను 100 శాతం రాయితీ మీద రైతులకు సరఫరా చేశాం.

కేంద్రప్రభుత్వం వారి ప్రతిష్టాత్మక కార్యక్రమాలలో ఒకటైన 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ' క్రింద లభిస్తున్న నూరుశాతం అదనపు సహాయం మొత్తం రూ. 601.98 కోట్లు. ఇందులో రూ. 577.25 కోట్లు ఇప్పటికే విడుదలయింది. ఉధృతంగా చిరుధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించటం ద్వారా అమలు జరుగుతున్న

'పోషక పదార్థాల భద్రత' కార్యక్రమంలోని ఉపప్రణాళికల క్రింద రూ. 7.92 కోట్లను, వర్షాధారిత ప్రాంతాల అభివృద్ధి క్రింద రూ. 20 కోట్లను కూడా కేంద్రం విడుదల చేసింది.

## అధ్యక్షా!

2013-14 సంవత్సరానికి కూడా మా ప్రభుత్వం కొనసాగించాలనుకుంటున్న పథకాలలో - నాణ్యమైన విత్తనాల సరఫరా, పొలంబడి, విస్తరణ కార్యక్రమాలు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ వ్యవసాయ బీమా పథకం, జాతీయ ఆహారభద్రతా మిషన్, పావలా వడ్డీపై రుణాలు, వడ్డీలేని పంటరుణాలు, వ్యవసాయంలో యాంత్రీకరణ, ఇన్‌పుట్ సబ్సిడీలు వగైరావున్నాయి.

పంటల బీమా పథకం క్రింద, 2011 ఖరీఫ్ నాటి క్లెయిమ్స్‌ని పరిష్కరించి రూ.446.94 కోట్ల మేరకు విడుదల చేయడం జరిగింది. ఇందువల్ల అన్ని జిల్లాల్లోనూ కలిపి 10 లక్షల 11 వేల మంది రైతులు ప్రయోజనం పొందారు. సవరించిన 'జాతీయ వ్యవసాయ బీమా పథకం' అనేక రైతుప్రోత్సాహక లక్షణాలను సంతరించుకున్నది. వీటిల్లో కుప్ప నూర్పిడి అనంతరం సంభవించగల నష్టాలు కూడా వున్నాయి.

## అధ్యక్షా!

పంటల బీమా అనేది దేశానికి ఆహారభద్రత కల్పించే రైతుకి ఆర్థిక భద్రత కల్పించే విశిష్టమైన పథకం.

గ్రామం ఒక యూనిట్‌గా అమలు చేస్తున్నాం కనుక రైతు విస్తృతంగా ప్రయోజనం పొందగలుగుతారు. బీమా వల్ల "ప్రకృతి వైపరీత్యాల నుంచి నన్ను ఆదుకోవడానికి ఈ ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోంది" అన్న విశ్వాసాన్ని, మనో స్థైర్యాన్ని అన్నదాతకు మేం అందించగలుగుతున్నాం. అన్నదాత శ్రమ, దేశభక్తి అసాధారణమైనవన్న భావం ప్రతి క్షణం మా మనసుల్లో మెదల్తూనే వుంటుంది. అందువల్లనే రైతు గురించి పదే పదే మేం ఆలోచించటం జరుగుతోంది.

మా ఈ సంకల్పం, ఆరాటం రైతులకిచ్చే పరపతి సౌకర్యం పెరుగుదలలో ప్రతిఫలిస్తూనేవుంది.

2012-13లో రూ. 37, 128 కోట్ల మేరకు పంటరుణాలు కల్పించాలని మేం లక్ష్యంగా పెట్టుకుంటే, అందులో రూ. 35, 545 కోట్లు రైతులకు అందించగలిగాం. ఇతర వ్యవసాయ రుణాలు, సంబంధిత టరమ్ రుణాలు క్రింద రూ. 15, 845 కోట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే రూ. 10,695 కోట్లు విడుదల చేశాం.

2013-14లో ఈ పరపతి సౌకర్యాన్ని ఇంకా ఎక్కువ మంది రైతులకు, మారుమూల గ్రామాల్లో సయితం, అందేలా చేయాలన్నది మా తపన. అందుకే 2012 -13లో విడుదల చేసిన మొత్తం రుణ సహాయం రూ.52,972 కోట్లు అయితే, దీన్ని 2013-14లో రూ. 59,818 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

## వ్యవసాయ టెక్నాలజీ మిషన్

## అధ్యక్షా!

12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో వ్యవసాయాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ టెక్నాలజీ మిషన్ (ఎ.టి.ఎం)ను ఏర్పాటు చేసిన విషయం మీకు తెలుసు. వ్యవసాయ అనుబంధ శాఖల మధ్య సమన్వయం సాధించడానికి, పరస్పర అవగాహనకు ఈ వ్యవసాయ టెక్నాలజీ మిషన్ దోహదపడుతుంది. వివిధ పంటల మధ్య దిగుబడి సామర్థ్య వ్యత్యాసాలను గుర్తించి, ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో ఆ వ్యత్యాసాలను అధిగమించడం, మెట్ట వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సాగునీటి వినియోగ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడం, పంటల మార్పిడి, వ్యవసాయోత్పత్తుల శుద్ధి, వ్యవసాయ రంగంలో అధిక లాభాలు వచ్చేందుకు వీలుగా మార్కెట్ అనుసంధానం, మార్కెటింగ్ పటిష్టతలను ప్రోత్సహించడం ఈ టెక్నాలజీ మిషన్ నిర్దిష్ట లక్ష్యాలు.

12వ పంచవర్ష ప్రణాళికలో, 2013-14 సంవత్సరంలో దృష్టి కేంద్రీకరిస్తున్న అంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

భూసార అభివృద్ధి, పరిరక్షణా నిర్వహణపై జాతీయ ప్రాజెక్టు 'భూ చేతన' ను అమలు చేయడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ విధానాల అభివృద్ధి ద్వారా పంటల దిగుబడిలో వ్యత్యాసాలను తొలగించడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు 'భూ చేతన'.

ఇక్రిశాట్ నేతృత్వంలోని కొన్ని సంస్థల సాంకేతిక మద్దతుతో భూమిలోని పోషక పదార్థాల లోపాలను గుర్తించి, పోషక పదార్థాల సమతుల్యత కోసం మండలాల వారీగా సిఫార్సులు చేయడం ద్వారా శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయాభివృద్ధి సాధించే ఒక వినూత్న విధానాన్ని వ్యవసాయశాఖ చేపట్టింది.

కొన్ని ఎంపిక చేసిన జిల్లాలలో లక్ష్యంగా నిర్దేశించుకున్న పంటల సగటు ఉత్పాదకతను ఐదు సంవత్సరాల కాలంలో 25 శాతం పెంచడం, వాతావరణానికి అనుగుణంగా అవలంబించగల పంటల వ్యూహాలను గుర్తించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.

## నిర్దిష్ట కార్యక్రమం ఇలా వుంటుంది

1. ఎంపిక చేసిన పంటల ఉత్పాదకతను 25 శాతం పెంచేందుకు మెరుగైన రకాలను గుర్తించడంతో పాటు, పోటీకి తట్టుకొనే ఉత్తమ సాగు యాజమాన్య విధానాలను (నేల, నీరు, పంట నిర్వహణ) గుర్తించడం.

2. భూమిలో, సూక్ష్మ, స్థూల పోషక పదార్థాలను సూచించే జి.ఐ.ఎస్ ఆధారిత పటాలను రూపొందించేందుకు వివిధ ప్రాంతాల నుంచి మట్టి నమూనాలను సేకరించడం.

3. లక్ష్యంగా నిర్దేశించుకున్న జిల్లాలలో వాతావరణ మార్పుల కారణంగా చూపగల ప్రభావాలను మదింపు చేయడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా అనుసరించదగు అనువైన వ్యూహాలను గుర్తించటం.

4. ప్రకృతి వనరుల సమర్ధ నిర్వహణలో ప్రమేయం గల వారి (రైతులు, వివిధ సంస్థల భాగస్వాములు) సామర్థ్యం పెంచేందుకు, మెట్ట భూములలో పంట ఉత్పాదకతను పెంచటం, భాగస్వామ్య పరిశోధన, అభివృద్ధి విధానాల రంగంలో వాతావరణ మార్పుల ప్రభావాలకు అనుగుణంగా అనుసరించదగు వ్యూహాలను రూపొందించడం.

2011-12లో 'ఇక్రిశాట్' - కర్నూలు, కడప, ఆదిలాబాద్, నల్గొండ, మెదక్, రంగారెడ్డి, ప్రకాశం, జిల్లాలలో వివిధ సంస్థల ద్వారా ఈ ప్రాజెక్టు చేపట్టింది. దీని క్రింద ఒక్కో జిల్లాలో 100 హెక్టార్లలో 3 నుంచి 5 మండలాలలో ఎంపికచేసిన క్లస్టర్ గ్రామాలలో 10 మంది రైతులను ఎంపికచేయటం జరిగింది. దిగుబడి పెరగడానికి దోహదపడే ఉత్తమ యాజమాన్య విధానాల ప్రయోజనాలను ప్రదర్శించటం జరిగింది. ఇందుకు గాను 2 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగింది.

2011-12 రబీ పంట కాలంలో రంగారెడ్డి జిల్లాలో సూక్ష్మ పోషక పదార్థాలను వినియోగించిన క్షేత్రంలో వరి ధాన్యం దిగుబడి 31.4 శాతం, ఎండుగడ్డి దిగుబడి 31 శాతం పెరిగింది. కడప జిల్లాలో సూక్ష్మ పోషక పదార్థాలు వినియోగించిన క్షేత్రంలో ప్రొద్దుతిరుగుడు పంట గింజల దిగుబడి 11.6 శాతం, నూనె శాతం 11.3 దిగుబడి పెరిగాయి.

2012-13లో 14 జిల్లాలు ఎంపిక చేయడం జరిగింది. వీటిలో కర్నూలు, కడప, ఆదిలాబాద్, నల్గొండ, మెదక్, రంగారెడ్డి, ప్రకాశం, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, అనంతరం, గుంటూరు, పశ్చిమగోదావరి, వరంగల్లు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో 500 హెక్టార్లు చొప్పున ఈ కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఇందుకు గాను 2012-13 సంవత్సరానికి 220 లక్షల రూపాయలు మంజూరు చేయటం జరిగింది.

2013-14లో జిల్లాకి 500 హెక్టార్ల చొప్పున, రాష్ట్రంలోని మొత్తం 22 జిల్లాలలో ఈ ప్రదర్శన క్షేత్రాల నిర్వహణకు 325 లక్షల రూపాయలు వ్యయం కాగల ప్రతిపాదనలు 'ఇక్రిశాట్' సమర్పించింది.

భూసార అభివృద్ధి, పరిరక్షణ, నిర్వహణ జాతీయ ప్రాజెక్టు అమలుకోసం 2013-14లో 2309.08 లక్షల రూపాయలు ప్రతిపాదించటం జరిగింది.

## వ్యవసాయ యాంత్రీకరణ

ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయ ఉత్పాదక వ్యయంలో భాగంగా ఉన్న కూలి రేట్లు పెరుగుతూ ఉన్నాయి. ఫలితంగా ప్రధాన పంటల సాగు వ్యయం పెరిగిపోతోంది. అన్ని జిల్లాలలో కూలీలకు గిరాకీ బాగా ఉంది. అందువల్ల 12వ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగ యాంత్రీకరణ పై దృష్టి పెట్టడం జరిగింది. ఈ చర్య సాగువ్యయం తగ్గడానికి, ఉత్పాదకత పెంచేందుకు కూడా దోహదపడుతుంది.

ఈ పథకం అమలు వల్ల యంత్ర సామర్థ్య వినియోగం ప్రస్తుతం హెక్టారుకు 1.70 కిలో వాట్లుగా ఉన్న దానిని 2013-14లో 1.74కి పెంచవచ్చని భావించటం జరుగుతోంది. హెక్టారుకు లక్ష్యంగా నిర్దేశించిన సామర్థ్య వినియోగాన్ని సాధించడంతో పాటు భారత ప్రభుత్వంపథకంలో హెచ్చించిన సబ్సిడీని వినియోగించుకోవడానికి భారత ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రాష్ట్ర సాధారణ ప్రణాళిక నుంచి ఇచ్చే కేటాయింపులను పెంచాలని ప్రతిపాదించడం జరిగింది. ట్రాక్టరుతో లాగే పరికరాలు 14,700, దమ్ము చక్రాలు 4,000, ట్రాక్టర్లు, మరనాగళ్లు 2000, విత్తనాలు, ఎరువులు వేసే యంత్రాలు  2000, మొక్కల రక్షణకు వినియోగించే పరికరాలు 25000, ఇతర యంత్ర పరికరాలు 7,500 సరఫరా చేయాలని యోచిస్తున్నాం.

వ్యవసాయ యాంత్రీకరణ పద్దుకోసం 450 కోట్ల రూపాయలు కేటాయించాలని ప్రతిపాదించడం జరిగింది. దీనికి అదనంగా సోలార్ పంపుసెట్లకోసం మరో 150 కోట్లరూపాయలు కేటాయించడం జరిగింది.

## విత్తన యాజమాన్యం :

వ్యవసాయోత్పత్తిని నిర్ణయించే కీలకాంశం విత్తనం. ఇతరు ఉత్పాదకాల శక్తి, సామర్థ్యాలు విత్తనం పైనే ఆధారపడి ఉంటాయి. ఉత్పత్తి పెరగాలంటే వివిధ వ్యవసాయ వాతావరణ పరిస్థితులకు తగిన నాణ్యమైన విత్తనాలు, అవసరమైనన్ని విత్తనాలు, అందుబాటు ధరలో లభించాలి. విత్తన మార్పిడి ఒక అనుసరించదగు

విధానం. దీని కోసం సిఫార్సు చేసిన రకాల వంగడాల విస్తరణను క్రమబద్ధీకరించే విధానాలు అవలంబిస్తున్నాం.

చిన్న, సన్నకారు రైతులకు వరి, మొక్కజొన్న, వేరుశనగ, పప్పు దినుసులు, ఇతర నూనె విత్తనాల వంటి వివిధ పంటల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయడం వల్ల విత్తనాలపై వారు పెట్టే వ్యయం తగ్గుతుంది.

అధిక దిగుబడులు సాధించేందుకు విత్తన మార్పిడి రేటును పెంచేందుకు వివిధ పంటలకు సంబంధించిన అధిక దిగుబడి విత్తనాలను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయాలని ప్రతిపాదించడం జరిగింది.

విత్తన గ్రామాల స్కీము క్రింద విత్తనాల ధృవీకరణకోసం నూరు శాతం సహాయం అందించడానికి కార్యక్రమాలు రూపొందించాం. విత్తన గ్రామాల స్కీము క్రింద అవసరమైన మంచి నాణ్యత గల ఫౌండేషన్ విత్తనాలను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వ విత్తన క్షేత్రాలను పటిష్ట పరచటం, విత్తనాల పరీక్షకు అవసరమైన ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

ఈ స్కీము క్రింద సమకూర్చిన నిధులతో పాటు, కేంద్రప్రభుత్వ పథకాలు ఆర్.కె.వి.వై, ఎన్.ఎఫ్.ఎస్.ఎం, ఐ.ఎస్.ఓ.పి.ఓ .ఎం, ఎన్.పి.హెచ్.ఎస్.హెచ్.ఎఫ్, వర్క్‌ప్లాన్ వంటి పథకాల క్రింద విత్తనాల సరఫరాకు విడుదల చేసిన నిధులను కూడా రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసేందుకు ఉపయోగించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమం అమలు కోసం, 2013-14లో 19.50 లక్షల క్వింటాళ్ళ విత్తనాలను సరఫరా చేసేందుకు 308 కోట్ల రూపాయలు ప్రతిపాదించడం జరిగింది.

## జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్.ఎ.ఐ.ఎస్)

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట చేతికి వచ్చే దాకా నమ్మకం లేకుండా పోతోంది. ఇలాంటి పరిస్థితిలో దుర్భిక్షం, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతాంగాన్ని ఆదుకోవడానికి పంటల బీమా తప్పనిసరి అయింది. ప్రభుత్వం ప్రకటించిన పంటల కోసం రుణాలు తీసుకొనే రైతాంగానికి ఈ బీమా పథకం తప్పనిసరి చేయటం జరిగింది. అయితే,రుణాలు పొందని రైతాంగం కూడా బ్యాంకుల ద్వారా 'భారత వ్యవసాయ బీమా కంపెనీ లిమిటెడ్' (ఎ.ఐ.సి) కి ప్రీమియం చెల్లించి ఈ బీమా సదుపాయం వినియోగించుకోవచ్చు.

## ఈ బీమా పథకం ప్రధాన లక్ష్యాలు :

✶ దుర్భిక్షం, తుఫాను, తెగుళ్ళు, రోగాలు మొదలైన కారణాల వల్ల పంట కోల్పోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవడం.

✶ పంట కోల్పోయిన రైతాంగానికి తదుపరి పంటకాలంలో కూడా రుణ సౌకర్యం పొందేలా అర్హత కల్గించడం.

✶ ఒక్కో పంటకు నిర్దేశించిన ప్రాంతాల ప్రాతిపదికగా ఈ బీమా పథకం పనిచేస్తుంది.

అందువల్ల, జాతీయ వ్యవసాయ బీమా పథకం, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం, సవరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకాల క్రింద ప్రీమియం సబ్సిడీ భరించడానికి, బీమా క్లయిమ్‌ల చెల్లింపులో రాష్ట్రం వాటా చెల్లించడానికి గ్రామం యూనిట్‌గా బీమా పథకం నిర్వహణా వ్యయం భరించడానికి 2013-14లో కార్యక్రమం అమలు చేసేందుకు 410 కోట్ల రూపాయలు అవసరం.

## రైతులకు పంటరుణాలు - పావలా వడ్డీ

రైతులు విజయవంతంగా పంటలు పండించాలంటే వారికి రుణాలు ఒక ప్రధాన ఉత్పాదకం. అందులోనూ జి.డి.పి అభివృద్ధి రేటులో నిర్దేశించిన 6 శాతం లక్ష్యం సాధించడానికి మన వంతుగా దోహదపడేందుకు ఇది చాలా అవసరం. అందువల్ల రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు, అదనపు సహాయాన్ని అందించడానికి వీలుగా పంట రుణాలపై వడ్డీ రాయితీ ఇవ్వడం జరుగుతోంది. 2008-09 నుంచి 3 శాతం వడ్డీ చొప్పున అంటే 'పావలా వడ్డీ' పథకాన్ని రైతుల పంట రుణాలకు కూడా విస్తరించడం జరిగింది.

లక్ష రూపాయల నుంచి 3 లక్షల రూపాయల వరకూ పంట రుణాలను పొంది, సకాలంలో తిరిగి చెల్లించిన రైతులంతా ఈ 'పావలావడ్డీ' పథకానికి అర్హులే. 2011-12 రబీ సీజన్ నుంచి షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, ఆర్.ఆర్.బిల నుండి పంట రుణాలు పొంది, సకాలంలో తిరిగి చెల్లించిన వారందరికీ ఈ పావలా వడ్డీ పథకం వర్తింపజేయడం జరుగుతోంది.

రాష్ట్రంలో ఓ వంక దుర్భిక్షం, మరోవంక భారీ వర్షాల వల్ల రైతాంగం కలత చెందుతోంది. ప్రభుత్వం వడ్డీరాయితీ, లేదా 'పావలా వడ్డీ' వంటి పథకాలు అమలు చేయకపోతే రైతులు మరింత అదనపు వడ్డీ భారాన్ని భరించవలసి వుంటుంది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్టు, అసలే నష్టపోయిన రైతుకు ఇది మరింత అదనపు భారం అవుతుంది. అందువల్ల అందజేసిన పంట రుణాలలో 50 శాతం తిరిగి వసూలు కాగలదని భావించి, రాష్ట్రంలో సుమారు 7.63 లక్షల మంది రైతులకు పావలా వడ్డీ క్రింద 60 కోట్ల రూపాయలు లబ్ధి చేకూర్చాలని ప్రతిపాదించాం.

# రైతు శ్రీ - వడ్డీలేని పంటరుణాలు

రైతులపై ఆర్థిక భారాన్ని మరింత తగ్గించేందుకు 2011-12 రబీ పంట కాలం నుంచి రైతులకు వడ్డీలేని రుణాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

సంస్థాగతమైన రుణాలను వినియోగించుకోవడానికి రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు, రైతులకు అవసరమైన సమయంలో తగినంత రుణసౌకర్యం కల్పించేందుకు, పంటరుణాలు సకాలంలో తిరిగి చెల్లించేలా ప్రోత్సహించేందుకు రైతాంగానికి తక్కువ వడ్డీ, లేదా, వడ్డీలేని రుణాలను అందుబాటులోకి తేవడం జరిగింది.

2008-09 నుంచి ఇప్పటివరకూ రైతాంగానికి 'పావలా వడ్డీ' (3 శాతం వడ్డీ)కి పంటరుణాలు అందించడం జరిగింది.

2011 నవంబరు 22న ప్రభుత్వం జి.ఓ. ఎం.ఎస్. నం. 270 ప్రకారం - 2011 రబీ పంట కాలం నుంచి సకాలంలో రుణాలు తిరిగి చెల్లిస్తే లక్షరూపాయల పంట రుణం వరకు రైతులందరికీ వడ్డీ లేకుండా రుణాలు అందిస్తామని, అలాగే లక్షరూపాయల నుంచి 3 లక్షల రూపాయల వరకూ పంటరుణాన్ని 'పావలా వడ్డీ' పై అందిస్తామని ప్రకటించింది. అయితే 2012 జూన్ 30న ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్.నం. 134 ప్రకారం, రైతులు సకాలంలో రుణాలను తిరిగి చెల్లించడంతో పాటు, ఫ్రంట్ ఎండ్ పద్ధతిపై జీరో వడ్డీ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరింది. 2012 ఖరీఫ్ నుంచి రైతులు తాము తీసుకున్న రుణ మొత్తాన్ని సకాలంలో తిరిగి చెల్లిస్తే వెంటనే సంబంధిత బ్యాంకులకు ప్రభుత్వం రైతు తరఫున వడ్డీ చెల్లిస్తుంది. రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్గించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు పరిచేందుకు 2013-14లో 500 కోట్ల రూపాయలు సమకూర్చడం జరిగింది. ప్రప్రథమంగా వ్యవసాయ యాంత్రీకరణ రుణాలకు, భూమి అభివృద్ధికి సంబంధించిన రుణాల కోసం వేర్వేరుగా నిధులు సమకూర్చడం జరిగింది. వ్యవసాయ యాంత్రీకరణ కోసం 2432.51 కోట్ల రూపాయలు, భూమి అభివృద్ధి రుణాల కోసం 654.75 కోట్లరూపాయలు కేటాయించాం. ఇది వ్యవసాయ ఉత్పత్తి రుణం 59,818.94 కోట్ల రూపాయలకు అదనం.

# వర్షాధారిత వ్యవసాయాభివృద్ధి

మొత్తం వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రాంతీయ అసమానతల తొలగింపులో వర్షాధార వ్యవసాయం ప్రధాన ఆటంకంగా ఉంది. రాష్ట్రంలో సాగవుతున్న భూమిలో 55 శాతం వర్షాధారితమే. వివిధ వ్యవసాయ వాతావరణ జోన్లలో దారిద్ర్య పరిస్థితులు అధికంగా ఉన్న భౌగోళిక ప్రదేశాలు ఈ వర్షాధారిత ప్రాంతాలలో ఉన్నాయి. వర్షాధార వ్యవసాయంలో ఉత్పాదకత చాలా తక్కువగా ఉండటం చాలా ఆందోళన కల్గిస్తోంది. భూమి నిర్వహణ, విత్తనాల లభ్యత, నీటి సదుపాయం, మద్దతు ధర, మార్కెట్ సదుపాయం, వ్యవసాయ

పరిశోధనా పెట్టుబడులు మొదలైన అంశాలలో తగినంత మద్దతు లేకపోవడమే ఇందుకు కారణం.

వర్షాధారిత వ్యవసాయాన్ని పునరుద్ధరించడానికి ఒక సమగ్ర విధాన ప్యాకేజిని రూపొందించకుంటే ఉత్పాదకతలో పెరుగుదలను సాధించలేం. ఈ ప్యాకేజీ స్థానికంగా సంబంధిత అంశాల సమాహారమై, వర్షాధారిత వ్యవసాయంలో ఉత్పాదకత పెంచేదిగా రూపకల్పన చేయాలి. అలాగే అందుబాటులో గల నీటితోనే సాగుచేస్తూ వర్షాధార వ్యవసాయ ఉత్పత్తి విధానంలో కాలానుగుణంగా వచ్చే అవాంతరాలను అధిగమించే స్థిరమైన విధానాలను రూపొందించాలి. దీనంతటికీ స్థానికంగా సమర్థవంతమైన ప్రణాళిక కీలకం.

వర్షాధారిత వ్యవసాయంలో విజయం సాధించాలంటే నీటి నిర్వహణ ప్రధాన పాత్ర వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా, పలు ప్రయివేటు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ద్వారా వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు వర్షాధారిత వ్యవసాయానికి ప్రధాన మద్ధతుగా నిలుస్తున్నాయి. అందువల్ల రాష్ట్రంలో వర్షాధారిత వ్యవసాయంలో ఉత్పాదకత, ఉత్పత్తి పెంచేందుకు పలు నిర్మాణాత్మక చర్యలు చేపట్టడం జరిగింది.

2013-14 సంవత్సరానికి ఇందుకు గాను 2903.50 కోట్ల రూపాయలను నేను ప్రతిపాదిస్తున్నాను. ఇందులో ప్రణాళికా నిధులు 2494.82 కోట్ల రూపాయలు, ప్రణాళికేతర నిధులు 408.68కోట్లు ఉన్నాయి. వ్యవసాయ కార్యక్రమాలు, పైన తెలిపిన వివిధ స్కీములను చేపట్టడానికి 2012-13లో వ్యవసాయ శాఖకు 2572.88 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది.

## ఉద్యానవనాలు

వ్యవసాయ రంగానికి ముఖ్యమైన ఉపరంగాలలో ఉద్యానవన రంగం ఒకటి. ఇటీవల కాలంలో ఇది ప్రాముఖ్యత సంతరించుకొంది. జి.ఎస్.డి.పిలో ఉద్యానవన శాఖ నుంచి క్రమంగా పెరుగుతూ వస్తున్న వాటా దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యానవన రంగం ఒక ఉపరంగంగా ఆశ్చర్యకరమైన రీతిలో అద్భుతమైన అభివృద్ధిని నమోదు చేసింది.

ఉద్యానవన ఉత్పత్తుల ఉత్పత్తిని, ఉత్పాదకతను, మౌలిక వసతుల, ఫలసాయం, యాజమాన్య విధానాల, దేశ విదేశ మార్కెట్లలో ఎగుమతుల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఉపరంగ అభివృద్ధిలో భాగంగా ప్రధానంగా చర్యలు చేపట్టింది.

తోటల సాగుదారులైన రైతులకు ప్రయోజనం కొరకు 2012-13లో వివిధ ఉద్యానవన అభివృద్ధి పథకాలను చేపట్టింది.

ఈ పథకాల ద్వారా రూ. 1092.53 కోట్లను సాయంగా అందించింది. వివిధ తోటల క్రింద సాగవుతున్న విస్తీర్ణం 25.56 లక్షల హెక్టార్లు. 273 లక్షల టన్నుల ఉద్యానవన ఉత్పత్తుల దిగుబడిని రాష్ట్రం సాధించింది.

దేశంలో సుగంధ ద్రవ్యాల సాగులో ఒకటవ స్థానాన్ని, పువ్వుల ఉత్పత్తిలో 3వ స్థానాన్ని రాష్ట్రం ఆక్రమించింది.

నీటిని పొదుపుగా వినియోగించి ఉత్పాదనలో అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. సూక్ష్మ సాగు పరికరాలకు అందించే సబ్సిడీని రూ. 50,000 నుంచి 2011లో రూ. 1 లక్షకు పెంచింది.

ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా మెరుగైన నీటి యాజమాన్య విధానాలతో, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి సూక్ష్మసాగు క్రింద సాగయ్యే విస్తీర్ణం పెంచడమే కాక, సోలార్ విద్యుత్ పరికరాలను కూడా వినియోగంలోనికి ప్రభుత్వం తీసుకొచ్చింది.

2012-13లో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు కేటాయించిన బడ్జెట్ రూ. 766.60 కోట్లు, ఈ మొత్తంలో రయా. 546.54 కోట్లు ఖర్చు చేసి 90,000 హెక్టార్లను బిందు, తుంపర్ల సాగు క్రిందికి ప్రభుత్వం తీసుకొచ్చింది.

రాష్ట్ర ప్రణాళిక క్రింద చేపట్టిన వివిధ ఉద్యానవన అభివృద్ధి పథకాల క్రింద, ఆయిల్‌పామ్ అభివృద్ధి పథకాల క్రింద, ప్రభుత్వం 2012-13లో రైతులకు రూ.8.60 కోట్ల సాయాన్ని అందించింది. ఇంతేకాక, రూ. 9.34 కోట్లను రాష్ట్ర హార్టికల్చరల్ మిషన్ క్రింద అమలయ్యే పథకాల లబ్దిదారులైన రైతులకు అందించింది. వీటితో పాటు ఆర్‌కెవీవై పథకం క్రింద రూ. 32.22 కోట్లును అందించింది.

ఇటీవల, ఉద్యానవనాభివృద్ధి లక్ష్యం సాంప్రదాయ ఉత్పాతకత పెంపునుంచి, అదనపు ప్రయోజనాల వృద్ధి వైపుకు మారింది. 12వ పంచవర్ష ప్రణాళికా అంతానికి ప్రభుత్వ ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణాన్ని ప్రస్తుత 25.56 లక్షల హెక్టార్ల నుంచి 28 లక్షల హెక్టార్లకు పెంచాలని, తద్వారా ఉత్పాదనను 272.96 లక్షల టన్నుల నుంచి 298.20 లక్షల టన్నులకు వృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తోంది.

ఉద్యానవన పంటల ఉత్పాదక పెంపుకు, దిగుబడి అనంతర నష్టాలను గణనీయంగా తగ్గించడానికి ప్రభుత్వం గొలుసు కోల్డు స్టోరేజీ, ఉత్పత్తుల శుద్ధిచేసే సౌకర్యాలను, మార్కెటింగ్ వసతులను పిపిపి విధానంలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించింది. జాతీయ హార్టికల్చరల్ మిషన్, ఆర్‌కెవివై పథకాలకు రాష్ట్ర వాటా నిధులను విడుదల చేయడం ద్వారా ప్రతిపాదిత సౌకర్యాలను కల్పిస్తారు.

2013-14 సంవత్సరానికి ఉద్యానవన ప్రణాళిక బడ్జెట్ క్రింద కేంద్ర ప్రయోజిత పథకాల అమలుతో సహా రూ. 517.42 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించింది.

వీటితో పాటు, రూ. 34.71 కోట్లు ప్రణాళికేతర బడ్జెట్ క్రింద సిబ్బంది జీత, భత్యాల కొరకు కేటాయించాలని ప్రతిపాదించారు.

## పశు సంవర్ధక శాఖ

పశుపోషణ, పశుగణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉంది. గడిచిన తొమ్మిదేళ్ళుగా మా ప్రభుత్వం తీసుకొంటున్న రైతు అనుకూల నిర్ణయాల వల్ల పశు సంపద, పౌల్ట్రీ, గొర్రెలు, మేకలు గణనీయంగా పెరిగాయి.

చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పశు సంపద కూడా దోహదం చేస్తోంది. రాష్ట్రంలోని చాలా రైతుకుటుంబాలు అదనపు ఆదాయం పొందేందుకు ఈ రంగంపై ఆధారపడుతున్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న వివిధ పథకాల వల్ల రాష్ట్రంలో దిగుబడి పెరగడమేకాకుండా జాతీయ స్థాయిలో మన రాష్ట్రం చెప్పుకోదగ్గ ప్రగతిని సాధిస్తోంది. పశుగణాభివృద్ధిలో జాతీయ స్థాయిలో రూపొందిన విధానాలను అమలు జరిపి రైతుల సమగ్రాభివృద్ధికోసం కృషి చేస్తున్నాం. ఫలితంగా రాష్ట్రంలోని ప్రజల పోషకాహార ప్రమాణాలను మెరుగుపరచడం జరుగుతోంది.

కోడి గుడ్లు, బ్రాయిలర్ కోళ్ళ ఉత్పత్తిలో మన రాష్ట్రం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని మీకు చెప్పడానికి ఎంతో గర్వంగా ఉంది. పౌల్ట్రీ రంగానికి మా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు వల్ల 2,013 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరిగింది. అలాగే పాల ఉత్పత్తిలోను మన రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో నిలిచింది. ఏటా 112.40 లక్షల టన్నుల పాల ఉత్పత్తిని సాధిస్తోంది-. మాంసం ఉత్పత్తిలోనూ దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా అగ్రస్థానంలో నిలచింది. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 7.47 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తి జరుగుతోంది.

రైతు ముంగిటకే పశువైద్య సేవలు విస్తరించడం వల్ల పశువులలో సోకే గాలికుంటు వ్యాధి, గోట్ ఫాక్స్ (+శీఖ్రాశీఞా), పిపిఆర్ వ్యాధులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. పశుగ్రాస అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా పశుసంపద, పాడి పరిశ్రమను అభివృద్ధి పర్చడంలో రాష్ట్రం ముందు వరసలో ఉంది.

హైదరాబాద్‌లోని మిల్క్ ప్యాకింగ్ అండ్ ప్రొడక్షన్ ఫ్యాక్టరీలో రూ. 8 కోట్లతో ఆధునీకరణ చేపట్టడం వల్ల పాలశుద్ధి, నాణ్యతను పెంచడం జరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పాల శీతలీకరణ కేంద్రాలను విస్తరించే కార్యక్రమాన్ని మా ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టింది. రూ. 12 కోట్లతో అనంతపురం జిల్లా, కళ్యాణ

దుర్గం, మెదక్‌జిల్లా పుల్కల్‌లో కొత్తగా ఏర్పాటు చేశాం. అలాగే మెదక్ జిల్లాలో మరో 15 బల్క్ శీతలీకరణ కేంద్రాలను, వరంగల్ జిల్లాలో 5 యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగింది.

డైరీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోంది. కామారెడ్డిలోని డైరీ టెక్నాలజీ కేంద్రాన్ని పూర్తిస్థాయి "డైరీ టెక్నాలజీ కాలేజి" గా అభివృద్ధి పరిచాం. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో గుంటూరు జిల్లా లాం, వరంగల్ జిల్లా మామ్‌నూర్‌లలో కృషి విజ్ఞాన కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేశాం. ఎన్.సి.డి.సి (NCDC) ఆర్థిక సహకారంతో మహబూబ్‌నగర్, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో రూ. 100 కోట్లతో గొర్రెల పెంపకం దార్లకోసం గొర్రెల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇందులో భాగంగా సంవత్సరానికి రెండు సార్లు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు (Deworming of Sheep Goat Programme) పెద్ద ఎత్తున వేయనున్నాం. ఈ కార్యక్రమం వల్ల రాష్ట్రంలోని 10 లక్షల మంది గొర్రెలు, మేకల పెంపకం దార్లు లబ్ధిపొందనున్నారు.

2013-14 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం సహకారంతో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను అలాగే రాష్ట్ర ప్రణాళికలో పేర్కొన్న లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (Live Stock Devolopment Programme) గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, పశుగ్రాస అభివృద్ధి, సీడ్స్ మినీకిట్స్ పంపిణీ, మొబైల్ వెటర్నరీ క్లినిక్స్, దూడల పెంపకం వంటి కార్యక్రమాలను కొనసాగించాలని మా ప్రభుత్వం నిర్ణయించింది.

కేంద్రం ప్రభుత్వ పథకాలను కలుపుకొని 2013-14 ఆర్థిక సంవత్సరంలో పశుసంవర్థక శాఖకు రూ. 269.57 కోట్లు ప్రణాళికా రూ. 654.58 కోట్లు ప్రణాళికేతర వ్యయంకింద ఖర్చు చేయాలని ప్రతిపాదించాం.

## మత్స్య శాఖ

రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ సమగ్ర అభివృద్ధిని సాదించాలంటే మానవ వనరుల సమర్థ యజమాన్యం, సాంకేతిక నైపుణ్యాల పెంపు, నాణ్యత వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మా ప్రభుత్వం భావిస్తోంది. లక్షలాది మందికి జీవన భృతి కల్పించడమే కాకుండా, సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సమకూర్చడానికి, విదేశీ మారక ద్రవ్యం పొందడంలోనూ ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోంది.

చేపల పరిశ్రమలో మన రాష్ట్రం దేశంలోనే ప్రముఖ స్థానంలో ఉంది. మంచి నీటి రొయ్యల ఉత్పత్తి, ష్రింప్ (Shrimp) ఉత్పత్తిలోనూ మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రతి ఏటా రూ. 11,000 కోట్ల

విలువైన చేపల ఉత్పత్తులు జరుగుతున్నాయి. 2012-13లో చేపలు, రొయ్యల ఉత్పత్తి 18 లక్షల టన్నులకు చేరుతుందని ఆశిస్తున్నాను.

## అధ్యక్షా!

రాష్ట్రంలో మత్స్య సంపదను పెంచడంతో పాటు, మత్స్యకారుల సంక్షేమానికి మా ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్న విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.

రాష్ట్రంలోని అక్వా రైతులకు ప్రయోజనం కల్గించేందుకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి చట్టం, 2006లో (వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూ మార్పిడి) సవరణలు చేశాం. ఆక్వాకల్చర్ భూములను చట్టం పరిధి నుంచి మినహాయించడం జరిగింది. సముద్రం పై వేటకు నిషేధం ఉన్న సమయంలో మత్స్యకారులను ఆదుకోవడానికి మెరైన్ ఫిషర్‌మెన్ రిలీఫ్ అండ్ వెల్ఫేర్ పథకం కింద రూ. 3.5 కోట్లు సహాయం అందించాం. అంతేకాకుండా 31 కిలోల వంతున బియ్యం సరఫరా చేశాం. దీనివల్ల 61,860 మంది గుర్తింపు పొందిన మెరైన్ ఫిషర్‌మెన్ ప్రయోజనం పొందారు.

## అధ్యక్షా!

ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను కొనసాగిస్తూనే మత్స్యకారుల వివరాలతో కూడిన డేటాబేస్‌కు తయారుచేయడం, జియోగ్రాఫికల్ ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్‌తో మత్స్య పరిశ్రమను అనుసంధానం చేయడం  సముద్రంపై వేటకు వెళ్లే మరబోట్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, మత్స్యకారులకు బయోమెట్రిక్ గుర్తింపు కార్డులను అందజేయడం ఈ 2013-14 సంవత్సరంలో అందజేయాలని నిర్ణయించాం.

కేంద్రం అందిస్తున్న పథకాలకు అందే నిధులతో కలుపుకొని ఈ 2013-14 సంవత్సరంలో మత్స్యశాఖకు ప్రణాళిక వ్యయం కింద రూ. 184.35 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించాం. దీనికి అదనంగా రూ. 57.16 కోట్లు ఉద్యోగుల జీతాలకోసం ప్రణాళికేతర వ్యయం కింద కేటాయించడం జరిగింది.

## అటవీ శాఖ

నీరు, గాలి, స్వచ్ఛతను కాపాడటంలో పర్యావరణం పరిరక్షణ కీలకమని మా ప్రభుత్వం గుర్తించింది.

## అధ్యక్షా!

రాష్ట్రంలోని 33  శాతం విస్తీర్ణంలో అడవులు ఉండాలని మా ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో

ఉన్న 23 శాతం అడవుల విస్తీర్ణాన్ని 33 శాతం పెంచడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజల భాగస్వామ్యంతో అడవుల విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 7718 వన సంరక్షణ సమితులు, ఎకో డెవలప్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని మీ ద్వారా సభ్యుల దృష్టికి తీసుకువస్తున్నాను. అడవుల సంరక్షణ, పర్యవేక్షణ, యాజమాన్యం కోసం అటవీ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటోంది. జి.ఐ.ఎస్ (+xూ), రిమోట్‌సెన్సింగ్, జి.పి.ఎస్ (ఙూ) పద్ధతులను అడవులలో ఉన్న చెట్ల వివరాలను, అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించడం, కొల్లేరు సరస్సు వివరాలను నమోదు చేయడం, అడవీ సరిహద్దులు మార్చడానికి, గుర్తించడానికి, అటవీ సంపదను కనుగొనడానికి వినియోగిస్తున్నారు.

రాష్ట్రంలో అటవీ సంపద తగ్గిపోతున్నట్లు గుర్తించిన 15 జిల్లాల్లో 82,380.72 హెక్టార్లలో యూకలిప్టస్ చెట్లను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ కృషి చేస్తోంది. 57,088 హెక్టార్లలో యూకలిప్టస్ క్లోనల్, సీడ్ ఆర్జిన్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అలాగే గిరిజన ప్రాంతాలలోని 4,010 హెక్టార్లలో కాఫీ తోటలను అటవీ అభివృద్ధి సంస్థ నిర్వహిస్తోంది. దీని ద్వారా నిరుపేదలైన స్థానిక గిరిజనులకు 6 లక్షల తలసరి పనిదినాలు కల్పిస్తుంది. 2012లో 550-600 టన్నుల కాఫీ దిగుబడిని సాధించాం. తద్వారా రూ.4.0 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా సంవత్సరం పొడవునా భూమిలేని నిరుపేదలు, గిరిజనులకు 15 నుంచి 18 లక్షల తలసరి పనిదినాలు లభిస్తున్నాయి.

ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యం ద్వారా అటవీ భూముల్లో "ఎకో టూరిజం"ను అభివృద్ధి పరచడానికి అటవీ అభివృద్ధి సంస్థ చొరవ తీసుకొని "ఎకో టూరిజంకు" అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి పరచనున్నారు. హైదరాబాద్ బొటానికల్ గార్డెన్స్ ఈ తరహాలో అభివృద్ధి చెందిన మొదటి ప్రాజెక్టు. మహవీర్ నిశ్చల్ వన ప్రాజెక్టు, రాజీవ్ ఎకో పార్కు ఇడుపుల పాయలో ఉండగా..... షామీర్ పేటలో జింకల పార్కు ఇదివరకే పర్యాటకుల సందర్శనార్థం ఉన్నాయి. ఇతర - ఎకో టూరిజం ప్రాజెక్టులలో చిల్కూరులో నైట్ సఫారీ, పక్షుల పార్కులను వచ్చే సంవత్సరం అభివృద్ధి పర్చాలని ప్రతిపాదించాం.

శాస్త్రీయమైన పద్ధతుల ద్వారా కలప, వెదురుతో పాటు ఇతర అటవీ ఉత్పత్తులను విక్రయించడం వల్ల ప్రభుత్వానికి 2012-13 సంవత్సరంలో 123 కోట్లు 22 లక్షలరూపాయల ఆదాయం వచ్చింది. 2012-13 లో యూకలిప్టస్ కలప ఉత్పత్తి 2,90,000 టన్నులకు పెరిగింది.

## అధ్యక్షా!

గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 తేదీల మధ్య జీవవైవిధ్య సదస్సును, కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సదస్సును **(Cop II)** హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాం. 175 దేశాల నుంచి 11,254 మంది ప్రతినిధులు ఈ

సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో జాతీయ జీవవైవిధ్య మ్యూజియం ఏర్పాటుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

ప్రణాళిక వ్యయం క్రింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, కేంద్రం స్పాన్సర్డ్ కార్యక్రమాలతో కలుపుకొని 2013-14 ఆర్థిక సంవత్సరానికి రూ.134.49 కోట్ల రూపాయలు కేటాయించాలని ప్రతిపాదించాం. ప్రణాళిక పద్దులకు అదనంగా ఉద్యోగుల జీత భత్యాలకు ప్రణాళికేతర వ్యయం కింద రూ. 398.17 కోట్లు బడ్జెట్ లో ప్రతిపాదించాం.

## సహకార శాఖ

సకాలంలో రుణాలు చెల్లించిన వారికి 6 శాతం వడ్డీ మినహాయింపును అమలు జరిపే పథకాన్ని సహకార శాఖ ద్వారా అమలు జరుపుతున్నాం. రైతులందరు కూడా రుణాలు పొందే అవకాశం కల్పిస్తున్నాం. ఈ పథకం ద్వారా 2013 జనవరి 31 నాటికి రూ. 22.65 కోట్లు విడుదల చేయడం జరిగింది.

కరీంనగర్ జిల్లా చింతకుంట గ్రామంలో 'మార్క్ ఫెడ్' ద్వారా రూ. 4.3 కోట్లతో 5 టన్నుల సామర్థ్యం కలిగిన ఆధునిక పశుదాన మిక్సింగ్ ప్లాంటుకు షేడ్ అఫ్ వాటా కింద 90 శాతం పెట్టుబడిని అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. న్యూఢిల్లీలోని జాతీయ సహకార అభివృద్ధి సంస్థ 70 శాతం రుణంగా అందిస్తుంది. అలాగే మరో 20 శాతం రాయితీని శుద్ధి కోసం, మిగిలిన 10 శాతం వాటాను మార్క్ ఫెడ్ భరాయిస్తుంది. ప్రభుత్వం ఇప్పటికే మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ. 96.75 లక్షలు విడుదల చేసింది.

సహకార శాఖకు 2013-14 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక వ్యయం కింద రూ. 6.87 కోట్లు ప్రతిపాదించాం. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్రం సహాయంతో రాష్ట్రం అమలు చేస్తున్న పథకాలతో కలుపుకొని, ప్రణాళిక పథకాలకు రూ. 6.87 కోట్లు కేటాయిస్తున్నాం. ప్రణాళికేతర వ్యయం క్రింద ఉద్యోగుల జీత భత్యాల కోసం రూ. 190.61 కోట్లు ప్రతిపాదించాం.

## నీటి పారుదల - వరదనివారణ

## అధ్యక్షా!

2004లో మా ప్రభుత్వం అధికారం చేపట్టాక పెద్ద ఎత్తున జలయజ్ఞం చేపడుతున్న విషయాన్ని మీ ద్వారా సభ్యులకు గుర్తుజేస్తున్నాను. రూ. 1,85,609 కోట్లతో 6,553 గ్రామాల లోని 2.54 కోట్ల మందికి తాగునీరును, 97 లక్షల ఎకరాలకు కొత్తగా సాగు నీరును, 22.5 లక్షల ఎకరాలల్లో ఆయికట్టు స్థిరీకరణ జరపాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంత పెద్దఎత్తున చేపడుతున్న జలయజ్ఞం ఫలాలను

ప్రజలకు త్వరిత గతిన అందించేందుకు 50 భారీ మధ్యతరహా ప్రాజెక్టుల పనులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

2004-05 తర్వాత యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్ (ఏఐబిపి) ద్వారా రాష్ట్రానికి రూ. 5,275.62 కోట్లు కేంద్రం నుంచి అందాయి. ఈ నిధులను 33 మధ్యతరహా, భారీ నీటి పారుదల ప్రాజెక్టులకు ఖర్చు చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో కలుపుకొని ఏఐబిపి కింద రూ. 17,102.70 కోట్లు ఖర్చుచేశాం. దీనితో ఇప్పటి వరకు 15,34,899 ఎకరాల ఆయికట్టుకు నీరందించడం జరిగింది. రాష్ట్రంలో ప్రవహిస్తున్న చిన్న చిన్న నదుల నుంచి సాగునీటి  సదుపాయం కల్పించడానికి 2012-13 సంవత్సరంలో మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 350 కోట్లు కేటాయించడం జరిగింది. అలాగే 2,13,159 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించాలనే లక్ష్యంలో రూ. 1,473.62 కోట్లతో 5 ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయిందని తెలియజేస్తున్నాను.

కరవు ప్రాంతాలు, తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాలలో సాగునీటి వసతి కల్పించేందుకు చిన్న నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. రాష్ట్రంలో 78,051 చిన్న నీటి వనరుల కింద 45.48 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాల ద్వారా కొత్తగా 0.65 లక్షల ఎకరాల ఆయకట్టు మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద సాగులోకి తెచ్చాం. అలాగే ఏపిఐడిసి ద్వారా 2012-13లో 29,742 ఎకరాల ఆయకట్టు కల్పించాం.

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం 50:50 శాతం వాటతో కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ మరియు నీటి యాజమాన్య కార్యక్రమాన్ని సెంట్రల్లీ స్పాన్సర్డ్ పథకం కింద చేపట్టాం. శ్రీరాంసాగర్, శ్రీశైలం కుడికాల్వ ప్రాజెక్టుల పనులు ఈ పథకం పరిధిలో చేపట్టాం. 2012-13 సంవత్సరంలో రూ. 23.43 కోట్లతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల 2004-05 నుంచి 2012-13 వరకు రాష్ట్రంలో 21,335 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్గింది. అందులో 17.472 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టుకాగా... 3.962 లక్షల ఎకరాల్లో ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. ఇందుకోసం రూ. 80,492.06 కోట్లు భారీ, మధ్యతరహా, చిన్న నీటి ప్రాజెక్టులు ~బ్యా.×.ఐ.జ మరియు ఇతర సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయటం జరిగింది. 2012-13 ఆర్థిక సంవత్సరంలో  రూ.7, 257.09 కోట్లు ఖర్చు చేశాం.

రాష్ట్రంలో జలయజ్ఞం కొనసాగించడానికి 2013-14 సంవత్సరంలో ప్రణాళిక వ్యయం క్రింద రూ.13,804.82 కోట్లు కేటాయించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించాం. దీనికి అదనంగా ఉద్యోగుల జీత భత్యాల కోసం ప్రణాళికేతర వ్యయం కింద మరో రూ.874.68 కోట్లు ప్రతిపాదించాం.

## పట్టు పరిశ్రమ

రాష్ట్రంలో గ్రామీణ పేదలకు పట్టు పరిశ్రమ - సేద్యం ఆధారిత పరిశ్రమగా కొనసాగుతోంది. రైతులు పెట్టిన పెట్టుబడికి అధిక దిగుబడులు వస్తున్నాయి. ఎకరానికి 5 మందికి సంవత్సరం పొడవునా సెరికల్చర్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సెరికల్చర్‌లో కీలకమైన సిల్క్‌వామ్ రేరింగ్ (Silk Worm Rearing), కకూన్ రీలింగ్ లో (Cocoon reeling) 60 శాతం పైగా మహిళల భాగస్వామ్యం ఉండటం మరో విశేషం.

రాష్ట్రంలో సిల్క్ దారం ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం రాయితీపై బ్రష్ కట్టర్స్, మల్బరీ హార్వెస్టింగ్ పరికరాలను రైతులకు అందజేస్తుంది. 2013-14 సంవత్సరంలో పట్టు రైతులను ప్రోత్సహించడానికి చర్ఖారీలర్స్ అందజేయడం, ముడి సిల్క్ శుద్ధి కోసం ప్రైవేటు రంగంలో ఏర్పాటు చేసే సిల్క్ రీలర్స్‌కు అయ్యే పెట్టుబడిలో వడ్డీ రాయితీ కల్పించడం జరుగుతుంది.

సాధారణ రాష్ట్ర ప్రణాళిక బడ్జెట్ క్రింద 2013-14లో ఈ రంగానికి రూ.79.20 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించాం. దీనికి అదనంగా ఉద్యోగుల జీత భత్యాలకోసం మరో రూ.122.40 కోట్లు ప్రణాళికేతర బడ్జెట్ కేటాయింపులు జరపాలని ప్రతిపాదించాం.

## అగ్రికల్చర్ మార్కెటింగ్ - గిడ్డంగులు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేటట్లు చేయడంలో మార్కెటింగ్ కీలకపాత్ర వహిస్తోంది. రైతులు పండించిన  పంటలకు సరైన ధర పలికినపుడు అమ్ముకోవడానికి వీలుగా ఫలసాయాన్ని నిల్వ చేసుకునే సదుపాయం విస్తృతంగా కల్పించడం వల్ల రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఆహార ధాన్యాలను నిల్వ ఉంచేందుకు మండల స్థాయిలో 39 గోడౌన్లను మార్కెటింగ్ శాఖ నిర్మిస్తోంది. దీనివల్ల 83,000 టన్నుల ఆహార ధాన్యాలు నిల్వచేసే సదుపాయం కలుగుతుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.41.77 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ పనులు నవంబర్ 2013 కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.

రైతులు తొందరపాటుతో తమ ఉత్పత్తులను సరైన ధరలు రాకముందే అమ్ముకోకూడదనే ఉద్దేశంతోనే మా ప్రభుత్వం నవంబర్ 2012 వరకు ''రైతు బంధు'' పథకం కింద 810 మంది రైతులకు రూ. 3.10 కోట్లు రుణంగా అందజేసింది.

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 6 రైతు బజార్ల ఏర్పాటుకు అనుమతించింది. అందులో ఇప్పటికే రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌లో రైతు బజారు ప్రారంభమైంది.

కోల్డ్ స్టోరేజీ సదుపాయాలు, సోలార్ పవర్ రైపెనింగ్ ఛాంబర్స్, నాన్ కార్బినో జెనిక్ రైపెనింగ్, గ్రీన్

టెక్నాలజీ వంటి 5 పథకాలను 2013-14 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ మార్కెటింగ్ విభాగం ద్వారా కొత్తగా ప్రవేశపెట్టాలని ప్రతిపాదించడం జరిగింది.

## ఫుడ్ ప్రాసెసింగ్

ఆహార ఉత్పత్తులకు విలువ జోడించటం వల్ల గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయమే జీవనాధారం చేసుకొంటున్న రైతులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ విధానాన్ని తెచ్చింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి అగ్రో ఇండస్ట్రీస్ ఏర్పాటు కీలకమని మా ప్రభుత్వం భావిస్తోంది.

ఇందుకోసం రాష్ట్రంలో రూ. 120 కోట్లతో ఆయిల్‌ఫాం ప్రాసెసింగ్ యూనిట్లు, రైస్ బ్రాన్ ఆయిల్ మిల్స్, ఓలియేరెజిన్స్ (Oleoresins) మరియు స్పైసెస్ ఆయిల్ (Chillies and Turmeric) యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

## చక్కెర రంగం

రాష్ట్రీయ స్థూల ఉత్పత్తి (GSDP) లో చక్కెర పరిశ్రమ ప్రధాన పాత్ర వహిస్తోంది. రాష్ట్రంలో చెరుకు రైతులను ప్రోత్సహించి వారికి ఈ రంగంలో ఉన్న అవకాశాలను అందించేందుకు చక్కెర విభాగం పనిచేస్తోంది. చక్కెర కర్మాగారాల పర్యవేక్షణ, పాలనాపరమైన అంశాలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది.

కేంద్ర పథకాలు, కేంద్ర సహకారంతో నడిచే పథకాల నిధులతో పాటు, రాష్ట్ర ప్రణాళిక వ్యయం క్రింద 2013-14 సంవత్సరానికి చక్కెర రంగానికి రూ. 52.05 కోట్లు కేటాయించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించాం. ప్రణాళికేతర వ్యయం క్రింద మరో రూ. 57.93 కోట్లు ఉద్యోగుల జీత భత్యాల కోసం కేటాయించాలని ప్రతిపాదించాం.

## అగ్రికల్చర్ పవర్

## అధ్యక్షా!

రాష్ట్రంలో విద్యుత్తు కొరత ఉన్నప్పటికీ రైతులకు 7 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నాం. డిస్కంలకు వ్యవసాయ విద్యుత్తు రాయితీలను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నాం. వ్యవసాయ విద్యుత్తు రాయితీ కోసం 2013-14 బడ్జెట్‌లో 3621 కోట్ల 99 లక్షల రూపాయలను కేటాయించాలని ప్రతిపాదించాం.

రాష్ట్రంలోని 16 జిల్లాల్లో జైకా (జీ×జూ) సహకారంతో రూ.1154.80 కోట్లతో 2.43 లక్షల వ్యవసాయ కనెక్షన్లను హెచ్.వి.డి.ఎస్ (ఎఎఋూ) వ్యవస్థలో చేర్చాలని ఈ బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాం. ఇందు వల్ల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు - ప్రసారంలో హెచ్చు తగ్గులు రాని నాణ్యమైన విద్యుత్‌ని సరఫరా చేయగలుగుతాం.

## మార్కెట్ ఆలంబన నిధి (Market Intervention Fund)

## అధ్యక్షా!

అహర్నిశలూ మా ఆలోచనా, ఆరాటం అంతా - రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి.

నేను వివరించిన పథకాలన్నీ కలిపి చూస్తే - మేలి రకం విత్తనాల సరఫరా దగ్గర నుంచి మార్కెట్‌లో గిట్టు బాటు ధరకు ఫలసాయాన్ని అమ్ముకునే దాకా రైతుకి వెన్నుదన్నుగా నిలబడటంలో మా ప్రభుత్వం యొక్క దృఢ సంకల్పం, నిబద్ధత స్పష్టంగా కనిపిస్తాయి.

ఇన్ని రకాలుగా రైతుకు సహాయం చేస్తున్నప్పటికీ నైతికంగా, భౌతికంగా "ఈ ప్రభుత్వం నాకోసం పని చేస్తోంది" అన్న విశ్వాసాన్ని రైతుకి కల్పించినప్పటికీ, అతను తన దిగుబడిని మార్కెటింగ్ చేసుకునే విషయంలో ప్రభుత్వానికి ఎటువంటి అదుపు ఉండదు.కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇస్తున్నప్పటికీ కొన్ని సందర్భాలలో రైతుకి గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇది రైతు శ్రేయోభిలాషులందరికీ చాలా బాధాకరమైన విషయం.

అందుకే, వ్యవసాయ ప్రత్యేక బడ్జెట్ ప్రతిపాదన వచ్చిన నాటి నుంచి "వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విషయంలో కూడా రైతుకి ఎందుకు మద్దతునివ్వలేము?" అని మా అధికారులతోనూ, నిపుణలతోనూ నేను సుదీర్ఘంగా చర్చించటం జరిగింది. ఫలితంగా మాకు వచ్చిన క్రొత్త ఆలోచన 'మార్కెట్ ఆలంబన నిధి' (Market Intervention Fund).

ఎప్పుడెప్పుడైతే వరి, జొన్న, మొక్కజొన్న, రాగి, పప్పుధాన్యాలు తదితర ప్రధాన ఆహారధాన్యాల మార్కెట్ ధర 'కనీస మద్దతు ధర' కన్నా పడిపోయే పరిస్థితి ఏర్పడుతుందో, అలాంటి సందర్భాలలో రైతు నష్టపోకుండా చూసేందుకు ఈ నిధిని ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం 2013-14 సంవత్సరంలో రూ100 కోట్లతో ఆలంబననిధిని ఏర్పాటు చేస్తున్నాం.

## ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి

ఇదే సందర్భంలో మరో ముఖ్యమైన ప్రతిపాదనను కూడా మేం చేయటం జరిగింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతుకి పంట నష్టం, పశుసంపద నష్టం జరిగి, అనూహ్యంగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడితే, అతని బీమా క్లెయిమ్‌లతో నిమిత్తం లేకుండా తక్షణ ఉపశమనం కల్పించడం కోసం 'ప్రకృతి వైపరీత్యాల సహాయనిధి'ని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించాం. ఈ నిధి నిమిత్తం 2013-14 బడ్జెట్‌లో రూ. 589.04 కోట్లను కేటాయించాలని ప్రతిపాదిస్తున్నాను.

## అధ్యక్షా!

పైన పేర్కొన్న వివిధ వ్యవసాయ కార్యక్రమాలు, పథకాల అమలు కోసం ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ క్రింద 2013-14 సంవత్సరానికి రూ.25,962.02 కోట్లు కేటాయించాలని ప్రతిపాదిస్తున్నాను. ఇందులో ప్రణాళిక వ్యయం రూ. 17,694.61 కోట్లు కాగా, ప్రణాళికేతర వ్యయం రూ.8,267.41 కోట్లు. ఈ బడ్జెట్ కేటాయింపులకు అదనంగా రూ.72,450 కోట్లు వ్యవసాయ పరపతి సౌకర్యాన్ని ప్రతిపాదిస్తున్నాను.

మొత్తం మీద 2013-14లో వ్యవసాయ రంగానికి రూ. 98,940.54 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించాం. అంటే 2012-13 నాటి రూ.79,924.78 కోట్ల బడ్జెట్ కన్నా 2013-14బడ్జెట్‌లో 24 శాతం అధికంగా పెంచడం జరిగింది.

## అధ్యక్షా!

వ్యవసాయరంగానికి తొలిసారిగా ప్రత్యేక బడ్జెట్‌ని ప్రవేశపెట్టడం అన్నది మన రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి.

ఈ ప్రత్యేక బడ్జెట్‌ని ప్రవేశపెట్టే ప్రక్రియలో భాగంగా నేను ఇందులో భాగస్వాములైన ఆయా శాఖల బడ్జెట్‌లను నిశితంగా అధ్యయనం చేయటం జరిగింది.

ఇలా సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయంతో కూడిన సమీకృత బడ్జెట్‌ని రూపొందించడం వల్ల ఇప్పుడు నాకు ఒక బలమైన విశ్వాసం కలుగుతోంది.

ఈ ప్రయత్నం మన రైతుని శక్తివంతుణ్ణి చేస్తుంది.

అతని ఆర్థిక, సామాజిక హోదాని పెంచుతుంది.

ఏతా వాతా, మన వ్యవసాయరంగం అభివృద్ధి వేగం బాగా పుంజుకుంటుంది.

ఫలితంగా, ఒకప్పుడు దక్షిణాదికి మాత్రమే 'ధాన్యాగారం' గా వర్ణించబడిన మన ఆంధ్రప్రదేశ్ యావత్ భారతదేశానికే 'అన్నపూర్ణ'గా ఎదుగుతుంది.

చివరగా ఒక్కమాట.

యజుర్వేదం నుంచి ఒక్క సూక్తి - నా స్వభావానికి సరిపడేది- ఇలా వుంది.

''మాతా భూమి ః పుత్రో అహం పృధివ్యాః''

నాకు అమ్మ ఈ భూమి. నేను ఈ భూమికి పుత్రుణ్ణి.